# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 11-1-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:121 పేజీలు:6 వెల: రూ.1/-


## ఢిల్లీ శాసనసభ ఎన్నికల కోసం గెజిట్ నోటిఫికేషన్ జారీ

న్యూ ఢిల్లీ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ):ఎన్నికల కమిషన్ సిఫార్సు మేరకు ఢిల్లీ రాజధానిలో శాసనసభ ఎన్నికల కోసం గెజిట్ నోటిఫికేషన్‌ను ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వికె సక్సేనా శుక్రవారం జారీ చేశారు. శుక్రవారం నాటి అధికారిక నోటిఫికేషన్ ప్రకారం, ఎన్నికల కార్యక్రమాన్ని ప్రజా ప్రాతినిధ్య చట్టం, 1951 ప్రకారం ప్రకటించడమైంది. 'భారత ఎన్నికల కమిషన్ సిఫార్సు ప్రకారం,ఢిల్లీ ఎన్‌సిటి శాసనసభకు సభ్యులను ఎన్నుకునేందుకు ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం (ఎన్‌సిటి)లోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు ఢిల్లీ ఎన్‌సిటి లెఫ్టినెంట్ గవర్నర్ పిలుపు ఇస్తున్నారు' అని నోటిఫికేషన్ తెలియజేసింది. త్వరలో రద్దయితే తప్ప ప్రస్తుత ఢిల్లీ శాసనసభ ఫిబ్రవరి 23 వరకు కొనసాగుతుందని,ఆ తరువాత తన కాలపరిమితి తీరిపోగానే రద్దు అవుతుందని నోటిఫికేషన్ తెలిపింది. నోటిఫికేషన్ ప్రకారం, నామినేషన్ పత్రాల దాఖలుకు ఆఖరు తేదీ ఈ నెల 17, పరిశీలన 18న జరుగుతుంది, నామినేషన్ పత్రాల ఉపసంహరణను 20 వరకు అనుమతిస్తారు. ఫిబ్రవరి 5న ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు వోటింగ్ జరుగుతుందని, ఎన్నికల ప్రక్రియ 10న ముగుస్తుందని నోటిఫికేషన్ వివరించింది. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తూ ప్రస్తుత శాసనసభ ఫిబ్రవరి 23న రద్దు అవుతుందని నోటిఫికేషన్ తెలిపింది. మొత్తం 70 నియోజకవర్గాలకు ఒకే దశలో ఫిబ్రవరి 5న తొమ్మిదవ ఢిల్లీ శాసనసభ ఎన్నికలునిర్వహించనున్నట్లు, 8న వోట్లు లెక్కించనున్నట్లు ఎన్నికల కమిషన్ ఈ నెల 7న ప్రకటించింది.

## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి -పారిశ్రామిక వేత్తలకు ముఖ్యమంత్రి పిలుపు ..

**-రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా తీర్చిదిద్దడం కల**
**-కాలుష్య రహితంగా నాలుగో నగరం నిర్మాణం**
**-రీజినల్ రింగ్ రోడ్ ప్రణాళిక దశలో ఉంది**

హైదరాబాద్, జనవరి 10: తెలంగాణ అభివృద్ధికి సంబంధించి తమకు ఒక కల ఉందని, అదే రాష్ట్రాన్ని రైజింగ్ తెలంగాణగా తీర్చిదిద్దడం అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైటెక్ సిటీలో సీఐఐ జాతీయ కౌన్సిల్ ను ఆయన ప్రారంభించారు. జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని హైదరాబాద్ లో నిర్వహించడం ఆనందదాయకమన్నారు.

### ఇతర నగరాలకు పోటీ ఇచ్చేలా నాలుగో నగరం నిర్మాణం

న్యూయార్క్, లండన్, టోక్యో, సియోల్ , దుబాయ్ తదితర నగరాలతో పోటీ పడేలా హైదరాబాద్ లో ఫోర్త్ సిటీ నిర్మించనున్నట్లు సీఎం అన్నారు. భారతదేశంలోనే గొప్ప నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మించాలని అనుకుంటున్నామని, ఇందులో సేవా రంగం మాత్రమే ఉంటుందని చెప్పారు. ఫ్యూచర్ సిటీ కాలుష్య రహిత నెట్ జీరో సిటీగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 3200 ఈవీ బస్సులను ఆర్టీసీ లోకి తీసుకువస్తున్నామన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు రిజిస్ట్రేషన్, రోడ్డు పన్నును తొలగించామన్నారు. భారతదేశంలోనే ఎలక్ట్రిక్ వాహనాలు అత్యంత వేగంగా అమ్ముడవుతున్న రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కొవడానికి హైదరాబాద్ సిద్ధమవుతుందని, వరదలు లేని నగరంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దాలనుకుంటున్నామని అన్నారు.

### 2050కి తాగునీటి అవసరాలకు కార్యాచరణ

2050 సంవత్సరానికి అవసరమయ్యే తాగు నీటి అవసరాలకు కావాల్సిన కార్యాచరణను ఇప్పటి నుంచే ప్రారంభించామని సీఎం తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్ ప్రణాళిక దశలో ఉందని చెప్పారు. 360 కి.మీ పొడవు రీజినల్ రింగ్ రోడ్ ను నిర్మిస్తున్నామని, దాని చుట్టూ రీజినల్ రింగ్ రైల్వేను ప్లాన్ చేస్తున్నామని అన్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌లను అనుసంధానించే రేడియల్ రోడ్లు కూడా నిర్మించబోతున్నామని తెలిపారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య తయారీ రంగానికి కేంద్రంగా ఉండబోతుందని చెప్పారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఈవీలు, సోలార్ వంటి పరిశ్రమలను ఇక్కడ ఏర్పాటు కాబోతున్నాయన్నారు. స్కిల్, ఉద్యోగాల కల్పనగా ప్రధానంగా దృష్టి సారించామని తెలిపారు.

### చైనాకు ప్లస్ సిటీగా హైదరాబాద్

హైదరాబాద్ ను చైనా కు ప్లస్ సిటీ గా మార్చే వ్యూహంతో ముందుకు వెళుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అవుటర్ రింగ్ రోడ్ బయట




ఉన్న గ్రామీణ తెలంగాణ లో వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయం, కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగుల వంటి పైన దృష్టి పెడతామన్నారు. తెలంగాణ కు తీరప్రాంతం లేదని, అందుకే ఇక్కడ డ్రై పోర్ట్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. ఏపీలోని బందర్ ఓడరేవు తో అనుసంధానం చేస్తూ ప్రత్యేక రహదారి తో పాటు రైల్వే కనెక్షన్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. మన ఆర్థిక వ్యవస్థ వృద్ధి చెందాలని ,మార్కెట్లు స్వేచ్ఛగా పనిచేయాలని కోరుకుంటున్నామన్నారు.

### తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు తమతో కలిసి రావాలని సీఎం పిలుపునిచ్చారు. పెట్టుబడులతో కలసి రండి.. అద్భుతాలు సృష్టిద్దామని అన్నారు. ప్రపంచంలోనే అత్యున్నత వ్యాపార సౌలభ్యాన్ని అందిస్తానని చెప్పారు. ప్రపంచంతో పోటీ పడేలా తెలంగాణ విద్యార్థులను తయార చేస్తామని చెప్పారు.

## 23 మంది సైబర్ నేరగాళ్లు అరెస్టు

హైదరాబాద్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); : ఆంధ్రప్రదేశ్, కర్నాటక, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, రాష్ట్రాల్లో సైబర్ నేరగాళ్ల కోసం హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారని సైబర్ క్రైమ్ డిసిపి కవిత తెలిపారు. సైబర్ నేరాలు చేస్తున్నా ముఠాను ఉత్తర ప్రదేశ్ లో పట్టుకున్నామని తెలియజేశారు. సైబర్ నేరగాళ్లను అరెస్టు చేసిన సందర్భంగా డిసిపి కవిత మీడియాతో మాట్లాడారు. సైబర్ నేరాల ముఠాలో ఓ మహిళ కీలకంగా వ్యవహరించినట్టు గుర్తించారు. అనుమానిత కాల్స్, మెసేజ్‌లు వస్తే స్పందించకూడదని, ఒక వేళ స్పందిస్తే ఖాతా నుంచి డబ్బులు పోయే ప్రమాదం ఉందన్నారు. ఆ నాలుగు రాష్ట్రాలలో 23 మంది సైబర్ నేరగాళ్లను అరెస్టు చేశామన్నారు. తెలంగాణలో 30 కేసులు, దేశ వ్యాప్తంగా 328 కేసుల్లో నిందితులుగా ఉన్నట్టు గుర్తించామని వివరించారు. నిందితుల నుంచి సెల్‌ఫోన్లు, చెక్‌బుక్‌లు, సిమ్‌కార్డులు పోలీసులు స్వాధీనం చేసుకున్నారని వివరించారు. నిందితులు పలు రకాల సైబర్ నేరాలకు పాల్పడినట్టు గుర్తించామన్నారు. కర్నాటక నుంచి మరో ఇద్దరు సైబర్ నేరగాళ్లను పట్టుకున్నామని కవిత స్పష్టం చేశారు.

## ఆదివాసీలపై వరాల జల్లు..

**-అధికారికంగా కొమురం భీం జయంతి, వర్ధంతి**
**-ఆదివాసీలపై పెట్టిన ఉద్యమ కేసులు ఎత్తివేస్తాం?**
**-ఆదివాసీ విద్యార్థులకు వంద శాతం ఓవర్‌షిప్ స్కాలర్‌షిప్‌లు**
**-గోండీ భాషలో బోధనపై సమగ్ర నివేదికకు ఆదేశం**
**-సాగుకు ఉచితంగా సోలార్ పంపు సెట్లు**
**ఆదివాసీ సంఘాలు, నాయకులతో సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

హైదరాబాద్, జనవరి 10:ఆదివాసీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరాల జల్లు కురిపించారు. ఆదివాసీ యోధుడు కొమురం భీం జయంతి.. వర్ధంతిని అధికారికంగా (స్టేట్ ఫంక్షన్‌గా) నిర్వహిస్తామని ప్రకటించారు. ఇందుకు సంబంధించి వెంటనే ఉత్తర్వుల జారీ చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి ఆదేశించారు.





ఆదివాసీ సంఘాలు, నాయకులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తమ ప్రాంతాల్లో రవాణా, సాగు, తాగునీటి సరఫరా, తమపై నమోదైన, నమోదవుతున్న కేసులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక సమస్యలను ఆదివాసీ నాయకులు ముఖ్యమంత్రికి సోదాహరణంగా వివరించారు.

ప్రతి సమస్యను సావధానంగా విన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారు లేవనెత్తిన పలు సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపారు. మరికొన్నింటి పరిష్కారానికి సమగ్ర అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఇది తొలి సమావేశం మాత్రమేనని, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి సమావేశమవుదామని ఆదివాసీ నాయకులకు సీఎం తెలిపారు.

ఏడాదికి మూడు సార్లు జరిగే సమావేశాల్లో గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, రాబోయే కాలంలో పరిష్కరించుకోవాల్సిన అంశాలపై చర్చిస్తామని ఆదివాసీ నాయకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభయమిచ్చారు. సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆందోళనలకు దిగవద్దని సీఎం సూచించారు.

ఆందోళనల ఫలితంగా యువకులపై కేసులు నమోదయితే భవిష్యత్‌లో అవి వారి ఉద్యోగ అవకాశాలకు గండిపెడతాయని సీఎం తెలిపారు. ఆదివాసీలపై ఉద్యమాల సమయంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని.. ఈవిషయంలో అవసరమైతే శాసనసభలో చర్చపెట్టి తీర్మానం చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

తాను పీసీసీ అధ్యక్షునిగా అయిన తర్వాత తొలి సమావేశం ఇంద్రవెల్లి లోనే పెట్టానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదివాసీ నాయకులకు గుర్తు చేశారు. నాటి సమావేశంలో తన దృష్టికి వచ్చిన ఇంద్రవెల్లి అమరుల స్మృతివనం ఏర్పాటు, అమరుల కుటుంబాలకు ఇళ్ల మంజూరు వంటి వాటిని అధికారంలోకి వచ్చిన వెంటనే పూర్తి చేశామని సీఎం తెలిపారు.

రాజకీయాలపరంగా ఆదివాసీలకు అన్యాయం చోటుచేసుకుండా చూస్తున్నామని, సీతక్కను ఆదిలాబాద్ జిల్లాకు ఇన్‌ఛార్జిగా మంత్రిగా పెట్టామని ముఖ్యమంత్రి అన్నారు.

ఆదివాసీ విద్యార్థులకు ప్రత్యేక స్టడీ సర్కిల్..

ఆదివాసీ విద్యార్థుల విద్యా, ఉద్యోగ, ఆర్థికాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా ఆదివాసీ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

స్టడీ సర్కిల్‌కు అవసరమైన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న ఆదివాసీ విద్యార్థులందరికీ ఓవర్‌షిప్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఆ దరఖాస్తుల వివరాలను వెంటనే మంత్రి సీతక్కకు అందజేయాలని సీఎం ఆదివాసీ నాయకులకు సూచించారు.

విద్యార్థులకు గోండీ భాషలో ప్రాథమిక విద్యను బోధించడానికి అవసరమైన ప్రణాళికపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉట్నూరు, భద్రాచలంలోని ట్రైబల్ బీఈడీ కళాశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తక్షణమే తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఆదివాసీ విద్యార్థులకు స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని, వారికి వసతి కల్పిస్తామని సీఎం తెలిపారు. ఏజెన్సీలోని ఐటీఐలను ఏటీసీలుగా మార్చుతున్నామని, వాటిలో ఆదివాసీ విద్యార్థులు చేరేలా ఆదివాసీ పెద్దలు, విద్యావంతులు ప్రోత్సహించాలని సీఎం సూచించారు.

### ఆర్థికాభివృద్ధిపై దృష్టి పెడతాం..

ఆదివాసీల ఆర్థికాభివృద్ధికి అండగా నిలుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేల కోటా కింద ఇచ్చే ఇళ్లతో సంబంధం లేకుండా ఆదివాసులకు సీఎం కోటా కింద ప్రత్యేకంగా ఇళ్లు మంజూరు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జనాభా ప్రాతిపదికన ఈ ఇళ్లు ఇచ్చేలా చూడాలని అధికారులను సీఎం ఆదేశించారు.

నాన్ ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలకు ఇళ్లు కేటాయిస్తామని సీఎం తెలిపారు. ఆదివాసీ రైతులకు ఉచితంగా సోలార్ మోటార్లు (వంద శాతం రాయితీ) అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు. ఇందిర జలప్రభ కింద ఉచితంగా బోర్లు వేసే అంశంపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం అధికారులకు సూచించారు.

ఉచితంగా సోలార్ పంపుసెట్లతో పాటు ఇళ్లకు సోలార్ ద్వారా విద్యుత్ అందించేందుకు ప్రయత్నిస్తామని సీఎం చెప్పారు. ఆదివాసీ గూడేల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని? ఇందుకోసం ఐటీడీఏల పరిధిలో వెంటనే స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

### కేస్లాపూర్ జాతరకు నిధులు

కేస్లాపూర్ జాతరకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివాసీలకు ఎంతో కీలకమైన రాయి సెంటర్లకు భవనాల నిర్మాణం చేపడతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రాయి సెంటర్ల నిర్మాణం, అందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఎన్ని భవనాలు అవసరమనే దానిపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

ఆయా భవనాలు ఎలా ఉండాలనే దానిపై పంచాయతీరాజ్ శాఖ నుంచి నమూనాలు తయారు చేయించాలని మంత్రి సీతక్కకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ప్రొఫెసర్ గుమ్మడి అనురాధ, ఆదివాసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## 18వ ప్రవాసీ భారతీయ దివస్ కన్వెన్షన్ వేడుకలకు హాజరైన భారత రాష్ట్రపతి




న్యూఢిల్లీ, జనవరి 10:భారత రాష్ట్రపతి, శ్రీమతి ద్రౌపది ముర్ము 18వ ప్రవాసీ భారతీయ దివస్ కన్వెన్షన్ యొక్క వేడుకలను అలంకరించి ప్రసంగించారు మరియు ఈరోజు (జనవరి 10, 2025) ఒడిశాలోని భువనేశ్వర్‌లో ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డులను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. ప్రవాస భారతీయులు మన దేశంలోని అత్యుత్తమ వ్యక్తులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని అన్నారు. వారు ఈ పవిత్ర భూమిలో సంపాదించిన జ్ఞానం మరియు నైపుణ్యాలను మాత్రమే కాకుండా, సహస్రాబ్దాలుగా మన నాగరికతకు పునాదిగా ఉన్న విలువలు మరియు నైతికతలను కూడా తమతో తీసుకువెళ్లారు. సాంకేతికత, వైద్యం, కళలు లేదా వ్యవస్థాపకత రంగాలలో అయినా, భారతీయ డయాస్పోరా ప్రపంచం గుర్తించే మరియు గౌరవించే ముద్ర వేసింది.ప్రవాసీ భారతీయ సమ్మాన్ అవార్డు గ్రహీతలందరికీ రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. వారి విజయగాథలు భారతదేశానికి గర్వకారణం మాత్రమేనని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది మందిని శ్రేష్ఠత కోసం కృషి చేసేందుకు స్ఫూర్తినిస్తాయని ఆమె అన్నారు. రిపబ్లిక్ ఆఫ్ ట్రినిడాడ్ అండ్ టొబాగో అధ్యక్షురాలు హర్ ఎక్సలెన్సీ క్రిస్టీన్ కంగలూను కూడా ఆమె అభినందించారు మరియు మహిళలు మరియు భారతీయ ప్రవాసులపై ప్రత్యేక దృష్టి సారించి తన దేశాన్ని నడిపించడంలో ఆమె చేసిన విశేష కృషి ప్రపంచ వేదికపై ఉన్నత ప్రమాణాన్ని నెలకొల్పిందని అన్నారు.

ప్రవాసీ భారతీయ దివస్ కేవలం ఒక కార్యక్రమంగా మారిందని రాష్ట్రపతి సంతోషం వ్యక్తం చేశారు. ఇది ఆలోచనలు కలిసే వేదిక, సహకారాలు ఏర్పడి, భారతదేశం మరియు దాని ప్రవాసుల మధ్య బంధాలు బలపడతాయని ఆమె అన్నారు. ఈ రోజు మన దేశం 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం - విక్షిత్ భారత్ వైపు పయనిస్తున్నదని రాష్ట్రపతి అన్నారు. విదేశాలలో నివసిస్తున్న వారితో సహా ప్రతి భారతీయుడు చురుకైన మరియు ఉత్సాహభరితమైన భాగస్వామ్యం అవసరమయ్యే జాతీయ మిషన్ అని ఆమె అన్నారు. ప్రవాస భారతీయులు ఈ విజన్‌లో అంతర్భాగమని ఆమె పేర్కొన్నారు. వారి ప్రపంచ ఉనికి వారికి ప్రత్యేకమైన దృక్పథాన్ని ఇస్తుంది మరియు వారి విజయాలు అభివృద్ధి చెందిన భారతదేశం యొక్క సాక్షాత్కారానికి గణనీయంగా దోహదపడే స్థితిలో వారిని ఉంచుతాయి.

వసుధైవ కుటుంబం యొక్క భారతదేశం యొక్క శాశ్వతమైన తత్వశాస్త్రం గురించి రాష్ట్రపతి ప్రస్తావిస్తూ, ఈ దార్శనికత మన అవసరాలను తీర్చడమే కాకుండా ప్రపంచ శ్రేయస్సుకు దోహదపడే పర్యావరణ వ్యవస్థను సృష్టించడం గురించి అన్నారు. రాబోయే తరాలకు ఉజ్వల భవిష్యత్తు ఉండేలా సామాజిక న్యాయం మరియు పర్యావరణ నిర్వహణతో ఆర్థిక పురోగతిని సమతుల్యం చేసే దేశంగా మేము కోరుకుంటున్నాము. ఈ దృక్పథాన్ని సాధించడంలో భారతీయ ప్రవాసులు కీలక పాత్ర పోషిస్తారని ఆమె పేర్కొన్నారు.మన ప్రవాసీ భారతీయ కుటుంబం సాధించిన విజయాలను మనం జరుపుకుంటున్నప్పుడు, మనం కూడా భవిష్యత్తు కోసం ఆశ మరియు సంకల్పంతో ఎదురుచూడాలని రాష్ట్రపతి అన్నారు. మనమంతా కలిసి ప్రపంచ వేదికపై ఉన్నతంగా నిలిచి ప్రపంచానికి వెలుగుగా నిలిచే దేశాన్ని విక్షిత్ భారత్‌ను నిర్మించగలం.

## తాను మనిషిని మాత్రమే, దేవుడిని కాను..

**-పొరపాట్లు జరుగుతుంటాయి.. వాటికి తాను అతీతుడిని కాను**
**-సంభాషణ శక్తి, అంకితభావం, ప్రజలతో అనుసంధానమై ఉండాలి**
**-ఒక లక్షం గల వ్యక్తులు కృతకృత్యులు అవుతారు**
**-వ్యక్తిగత ఆకాంక్షలు గలవారు రాజకీయ రంగంలో విఫలం అవుతారు**
**-రాజకీయాల్లోకి ప్రవేశం సులభమే, కానీ విజయం సాధించడమనేది భిన్నమైన సవాల్'**
**-ప్రతి ఒక్కరూ తాము చెప్పేది వింటారని ఎవరైనా భావిస్తుంటే వారు పొరబడినట్లే.**
**-తన పాడ్‌కాస్ట్ అరంగేట్రంలో ప్రధాని మోడీ ఉద్ఘాటన**



న్యూ ఢిల్లీ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ )బి;ఒక రాజకీయ నేత జయప్రదం కావడానికి కావలసిన లక్షణాలను ప్రధాని నరేంద్ర మోడీ జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్‌తో పాడ్‌కాస్ట్‌లో వివరించారు. సంభాషణ శక్తి, అంకితభావం, ప్రజలతో అనుసంధానమై ఉండడం ఆవశ్యకమని ప్రధాని మోడీ ఉద్ఘాటించారు. ఒక లక్షం గల వ్యక్తులు కృతకృత్యులు అవుతారని, వ్యక్తిగత ఆకాంక్షలు గలవారు రాజకీయ రంగంలో విఫలం అవుతారని మోడీ అన్నారు. రాజకీయాల్లోకి ప్రవేశించేందుకు ఒకరికి అవసరమైన ప్రతిభ గురించిన కామత్ ప్రశ్నకు మోడీ సమాధానం ఇస్తూ, 'రాజకీయాల్లోకి ప్రవేశం సులభమే, కానీ విజయం సాధించడమనేది పూర్తిగా భిన్నమైన సవాల్' అని పేర్కొన్నారు. 'రాజకీయాల్లో విజయం సాధించాలంటే పూర్తి అంకితభావం, మంచి కాలంలో, చెడు కాలంలో ప్రజలతో నిరంతరం మమేకమై ఉండాలి, ఒక జట్టు సభ్యునిగా పని చేసే సామర్థ్యం ఉండాలి. ప్రతి ఒక్కరూ తాము చెప్పేది వింటారని, లేదా తమ వ్యవహరణ తీరును అనుసరిస్తారని ఎవరైనా భావిస్తుంటే వారు పొరబడినట్లే నన్నారు.వారు కొన్ని ఎన్నికల్లో గెలవవచ్చు, కానీ వారు విజయవంతమైన నేతగా ఆవిర్భవిస్తారనే గ్యారంటీ లేదు' అని ప్రధాని మోడీ తన పాడ్‌కాస్ట్ అరంగేట్రంలో చెప్పారు. భారత స్వాతంత్ర్య పోరాట సమయంలోని సవాళ్ల, స్వాతంత్ర్యానంతర భారతంలో రాజకీయ రంగస్థలిలోని సవాళ్ల మధ్య ఆయన పోలిక తెచ్చారు. 'భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో విభిన్న నేపథ్యాల వారు పాల్గొని, రకరకాలుగా సేవలు అందజేశారు. కొంత మంది జనానికి విద్యా బోధన చేశారు, ఇతరు ఖద్దరు నేతలో నిమగ్నమయ్యారు, అనేక మంది ఆదివాసీల అభ్యున్నతి కోసం కృషి చేశారు. అయినప్పటికీ వారంతా దేశభక్తి స్ఫూర్తితో సంఘటితం అయ్యారు' అని ప్రధాని మోడీ వివరించారు. 'స్వాతంత్ర్యం తరువాత ఆ వ్యక్తుల్లో కొందరు రాజకీయాల్లోకి ప్రవేశించి, సాటిలేని పరిణతిని, అంకితభావాన్ని, ప్రగాఢ లక్ష్యాన్ని తమతో తీసుకువచ్చారు' అని ఆయన పేర్కొన్నారు.'వ్యక్తిగత ఆకాంక్షలతో కాకుండా ఒక లక్ష్యంతో రాజకీయాల్లోకి రావడం మంచి వ్యక్తులకు కీలకం' అని ప్రధాని నొక్కిచెప్పారు. 'ఉదాహరణకు మహాత్మా గాంధీని తీసుకోండి. ఆయన గొప్ప వక్త అయి ఉండకపోవచ్చు, కానీ ఆయన వ్యక్తిత్వం, జనంతో అనుబంధం దేశాన్ని సంఘటితం చేసింది. గాంధీ ఎన్నడూ టోపీ ధరించలేదు, కానీ 'గాంధీ టోపీ'ని ప్రపంచం గుర్తుంచుకుంటున్నది. అదే సిసలైన భావ వ్యక్తీకరణ, నాయకత్వ బలం' అని మోడీ అన్నారు. మాటలతో ఆకట్టుకునే 'వృత్తిగత రాజకీయ నేతలు' స్వల్ప కాలం పనికివస్తారే కానీ చిరకాలం ఉండబోరని ప్రధాని అన్నారు. యువజనుల రాజకీయ ప్రవేశం గురించిన ప్రశ్నకు మోడీ సమాధానం ఇస్తూ, 'దేశానికి సేవ చేయాలనే నిస్వార్థ కాంక్షగల లక్షలాది నిబద్ధులైన యువ రాజకీయ నాయకులు భారత్‌కు అవసరం' అని ఉద్ఘాటించారు. 'రాజకీయాలు ఇవ్వడం, పొందడం, చేయడం గురించి కాదు. అటువంటి దృక్పథం దీర్ఘ కాలం ఉపకరించదు' అని కూడా మోడీ చెప్పారు,మనిషిని మాత్రమే, దేవుడిని కాను, పొరపాట్లు జరుగుతుంటాయిప్రధాని నరేంద్ర మోడీ జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ ఆధ్వర్యంలోని పీపుల్ బై డబ్లుటిఎఫ్' సిరీస్‌తో పాడ్‌కాస్ట్ అరంగేట్రం చేస్తూ, పొరపాట్లు జరుగుతుంటాయని, వాటికి తాను అతీతుడిని ఏమీ కానని చెప్పారు. 'పొరపాట్లు జరుగుతుంటాయి, నేనూ కొన్ని చేయవచ్చు. నేను కూడా మనిషినే. దేవుడిని కాను' అని కామత్‌తో మోడీ అన్నారు. పాడ్‌కాస్ట్ ఆరంభంలో తన భాషా నైపుణ్య గురించి జెరోధా సహ వ్యవస్థాపకుడు తన భయాన్ని పంచుకుంటూ తనకు 'సరిగ్గా రాని హిందీ' గురించి హాస్యపూరితంగా ప్రస్తావించారు. 'సార్! నా హిందీ బాగుండకపోతే నన్ను క్షమించండి. నేను దక్షిణాదివాడిని. నేను ఎక్కువగా బెంగళూరులో పెరిగాను. మా అమ్మగారి ఊరు మైసూరు. అక్కడ ప్రజలు చాలా వరకు కన్నడ భాష మాట్లాడతారు. మా తండ్రిది మంగళూరు సమీప ప్రాంతం.నేను పాఠశాలలో హిందీ నేర్చుకున్నాను. నాకు ఆ భాషను అంత ధారాళంగా మాట్లాడలేను' అని కామత్ ప్రధాని మోడీతోచెప్పారు.

ఇందుకు ప్రధాని మోడీ భరోసాపూర్వకంగా స్పందిస్తూ, "హమ్ దోనో కి ఐసే హీ చలేగీ' (ఇదే విధంగా కలిసి సాగిద్దాం). నేను మీ ముందు కూర్చుని మాట్లాడుతున్నాను, ఒక విధమైన ఆందోళనతో ఉన్నాను. ఇది నాకు సంక్లిష్టమైన సంభాషణ. ఇది నా తొలి పాడ్‌కాస్ట్. మీ ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో నాకు తెలియదు' అని చెప్పారు. రెండు గంటల నిడివి గల ఈ పాడ్‌కాస్ట్‌లో ప్రధాని మోడీ తన బాల్యం, విద్య, రాజకీయ ప్రవేశం, ఎదురుదెబ్బలు, ఒత్తిడిని అధిగమించడం, విధాన నిర్వహణ సహా అనేక జ్ఞాపకాలను పంచుకున్నారు. 'మా కుటుంబ సభ్యుల దుస్తులు ఉతుకుతుండేవాడిని. ఆ కారణంగా సరస్సు వద్దకు వెళ్లేందుకు నన్ను అనుమతించేవారు' అని ప్రధాని మోడీ తెలిపారు.

## వాళ్లకు మాత్రమే ఈసారి ఛాన్స్ : సుప్రీం కోర్టు

న్యూ ఢిల్లీ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఐఐటీల్లో బీటెక్, బీఆర్క్ సీట్ల భర్తీకి నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 మూడుసార్లు రాసుకోవచ్చని ప్రకటించి.. ఆ తర్వాత రెండుసార్లకే పరిమితం చేయడంపై పలువురు విద్యార్థులు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై శుక్రవారం విచారణ జరిపిన న్యాయస్థానం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను రెండుసార్లు రాసేలా జేఏబీ తీసుకున్న నిర్ణయంలో జోక్యం చేసుకోలేమని పేర్కొంది. అలాగే ఐఐటీ కాన్పూర్ ప్రకటన నేపథ్యంలో 2024 నవంబర్ 518 తేదీల మధ్య కాలంలో తమ కోర్సుల నుంచి డ్రాప్ అవుట్ అయిన విద్యార్థులకు ఉపశమనం కలిగించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్ 2025 పరీక్షకు వారు రిజిస్టర్ చేసుకునేందుకు అవకాశం కల్పించింది. జేఈఈ అడ్వాన్స్‌డ్‌ను మూడుసార్లు రాసే అవకాశం కల్పిస్తున్నట్టు నవంబర్ 5న ఐఐటీ కాన్పూర్ నిర్ణయించింది. ఆ తర్వాత 18 వ తేదీన జాయింట్ అడ్మిషన్ బోర్డు (జేఏబీ )యూటర్న్ తీసుకోవడంతో పలువురు అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు.

విద్యార్థుల అర్హత ప్రమాణాల్లో చేసిన ఆకస్మిక మార్పులు పిటిషనర్లతో పాటు ఇలాంటి వేలాది మంది విద్యార్థులు ఐఐటీల్లో ప్రవేశించేందుకు విలువైన అవకాశాన్ని ప్రభావితం చేస్తాయని సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని తెలిపారు. ఐఐటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి 2013 నుంచి జేఈఈ అడ్వాన్స్‌డ్ పేరిట పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దానికి ఇంటర్ పాసైన సంవత్సరంతోపాటు ఆ తర్వాత ఏడాది , అంటే వరుసగా రెండుసార్లు మాత్రమే హాజరు కావొచ్చు. దాన్ని మూడుసార్లకు పెంచుతూ జేఈఈ అడ్వాన్స్‌డ్ నిర్వహణ బాధ్యత తీసుకున్న ఐఐటీ కాన్పూర్ గత ఏడాది నవంబరు 5వ తేదీన ప్రకటించింది. పట్టుమని 15 రోజులు కాకముందే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకుంది. దీంతో గతంలో మాదిరిగానే రెండుసార్లు మాత్రమే ఈ పరీక్ష రాసుకోవచ్చు. వచ్చే మే నెలలో జరిగే అడ్వాన్స్‌డ్ పరీక్షకు 2024 మార్చి, 2025 మార్చిలో జరిగే ఇంటర్ లేదా తత్సమానమైన పరీక్షల్లో పాసైన వారు మాత్రమే అర్హులు. అంతకంటే ముందు ఉత్తీర్ణులైన వారికి అవకాశం ఉండదు.

# ఆధునిక యుగంలోనూ మానవ అక్రమ రవాణా !

## (11 జనవరి "జాతీయ మానవ అక్రమ రవాణా అవగాహన దినం" సందర్భంగా)

ఒక నిస్సహాయ దుర్భర పరిస్థితుల్లో ఉన్న వ్యక్తి శ్రమను ఉచితంగా లేదా అత్యల్ప వేతనమిచ్చి దోచుకోవడం, వెట్టిచాకిరి, బంధించి లేదా భయపెట్టి గృహ పనులను చేయించుకోవడం, బలవంతంగా పడుపు వృత్తిలోకి దించి వ్యాపారం చేయడం, మోసం చేస్తూ బలహీనులను వాడుకోవడం, మానవ హక్కుల హననాలు లాంటి చర్యలను "మానవ అక్రమ రవాణా"గా పేర్కొంటాం. నేటి అత్యాధునిక సమాజంలో కూడా ఇలాంటి భయంకర, అభ్యంతరకర దురాచారాలు కొనసాగడం అత్యంత ఆక్షేపణీయం. ఈ దురాచారాలు నేడు విశ్వవ్యాప్తంగా కొనసాగడం, మిలియన్ల అభాగ్యుల జీవితాలు చీకట్లోనే కలిసి పోవడం జరుగుతున్న సమయంలో ఇలాంటి మానవ అక్రమ రవాణా, అపరిమిత శ్రమ దోపిడీలను సామాన్య ప్రజానీకానికి అవగాహన పర్చడానికి అమెరికా లాంటి పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన "జాతీయ మానవ అక్రమ రవాణా అవగాహన దినం" వేదికలను ప్రతి ఏట 11 జనవరిన పలు దేశాల్లో నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

బలవంతంగా అతి కష్టమైన పనులను అక్రమార్కులు తమ స్వార్థం కోసం చేస్తుండడం, ఎదిరించిన కుటుంబాలను సహితం బెదిరించడం లేదా హింసించడం, మహిళల్ని బలవంతంగా పడుపు వృత్తిలోకి దించి వ్యాపారాలు చేయడం, శ్రమకు తగిన వేతనాలు చెల్లించకపోవడం, కనీస ఆహారాన్ని అందించకపోవడం, నిద్రకు కూడా తగు సమయం ఇవ్వకపోవడం, బయటి ప్రపంచానికి దూరంగా చీకటి గదుల్లో బంధించడం, వారి గుర్తింపును దాచడం, పాస్‌పోర్ట్/వీసా లాంటివి లాక్కోవడం లాంటి మానవ అక్రమ రవాణా దురాగతాలు జరుగకుండా చూసుకోవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద అధికంగా ఉన్నప్పటికీ సాధారణ పౌర సమాజ చొరవ కూడా అవసరం అవుతుందని గమనించాలి. జాతీయ మానవ అక్రమ రవాణా అవగాహన దినం-2025 థీమ్‌గా "అక్రమ రవాణా లోపాలను సవరిస్తూ బలమైన సమాజ నిర్మాణం" అనబడే అంశాన్ని తీసుకున్నారు.

మానవ అక్రమ రవాణా, శ్రమ దోపిడీలను తగ్గించడానికి లేదా నివారించడానికి స్థానిక సమాజ చొరవ, కార్యకర్తలను శిక్షణలు, సమాచార వ్యాప్తి, బాధితులను ఆదుకోవడం, దోపిడీ ముంగిట్లో నిలబడిన అభాగ్యుల రక్షణ, అవసర నైపుణ్యాలు, గుర్తించే నెట్‌వర్క్ వ్యవస్థల స్థాపన, ప్రభుత్వంతో పౌర సమాజం కలిసి పని చేయడం, మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా పోరాడుతున్న సంస్థల చొరవ, పాలసీలను రూపొందించి అమలు పరచడం, విద్యావంతుల విస్తృత ప్రచారం, అక్రమార్కులకు కఠిన శిక్షలు అమలు పరచడం లాంటి పలు చర్యలు దోహదపడతాయి.

మానవ అక్రమ రవాణా, శ్రమ దోపిడీల పట్ల అవగాహన కలిగి ఉండడం మనందరి కనీస పాత్ర. మానవ హక్కులకు పట్టం కట్టడం, అక్రమార్జనపరుల భరతం పట్టడం, 11 జనవరి రోజుల బ్లూ రంగు దుస్తులు ధరించి అన్యాయానికి గురవుతున్న అభాగ్యులకు మన సంఘీభావాలను వ్యక్తం చేయడం మరిచి పోరాదు. శ్రమ దోపిడీ కనిపించని ప్రపంచ నిర్మాణంలో మనం కూడా భాగం అవుదాం, చీకటి గుహల్లో మగ్గుతున్న అస్థిపంజరాల జీవితాల్లో వెలుగులు నింపుదాం.

– డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ప్రపంచ ప్రధాన ఔషధ కూడలిగా భారత్ తెచ్చుకున్న గుర్తింపునకు దేశం నేడు కొత్త కోణం జోడిస్తోంది

న్యూఢిల్లీ, జనవరి 10:జీనోమ్ ఇండియా ప్రాజెక్ట్ ప్రారంభోత్సవం నేపథ్యంలో ప్రధానమంత్రి ఇవాళ వీడియో సందేశం ద్వారా ప్రసంగించారు. పరిశోధన రంగంలో భారత్ నేడు చారిత్రకంగా ముందంజ వేసిందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఈ ప్రాజెక్టుకు 5 సంవత్సరాల కిందటే ఆమోదం లభించిందని ప్రధాని గుర్తుచేశారు. అయితే, కోవిడ్ మహమ్మారి ఎన్నో సవాళ్లు విసిరినా, మన శాస్త్రవేత్తలు అత్యంత శ్రద్ధాసక్తులతో దీన్ని పూర్తి చేశారని పేర్కొన్నారు. ఈ పరిశోధనలో 'ఐఐఎస్సీ, ఐఐటీ', 'సిఎస్ఐఆర్', 'డిబిటి-బ్రిక్' వంటి 20కిపైగా విశిష్ట పరిశోధనా సంస్థలు ప్రధాన పాత్ర పోషించాయని శ్రీ మోదీ వివరించారు. దీని ఫలితంగా 10,000 మంది భారతీయుల జన్యు క్రమంతో కూడిన సమాచారం నేడు భారత బయోలాజికల్ డేటా సెంటర్‌లో అందుబాటులో ఉందన్నారు. జీవ సాంకేతిక పరిశోధన రంగంలో ఈ ప్రాజెక్టు ఓ కీలక మలుపుగా నిలవగలదని శ్రీ మోదీ విశ్వాసం వ్యక్తంచేస్తూ, దీనితో ముడిపడిన భాగస్వామ్య సంస్థలన్నిటికీ అభినందనలు తెలిపారు.

శ్రీ మోదీ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ- "భారత జీవ సాంకేతిక రంగంలో జీనోమ్ఇండియా ప్రాజెక్టును ఒక కీలక ఘట్టం"గా అభివర్ణించారు. వివిధ జనజాతుల నుంచి 10,000 మంది వ్యక్తుల జన్యు క్రమాన్ని రూపొందించడం ద్వారా వైవిధ్య భరిత జన్యు వనరును ఈ ప్రాజెక్ట్ విజయవంతంగా సృష్టించిందని పేర్కొన్నారు. ఈ సమాచార నిధి ఇకపై శాస్త్రవేత్తలు, పరిశోధకులకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. అంతేకాకుండా భారత జన్యు నేపథ్యాన్ని అవగతం చేసుకోవడంలో నిపుణులకు తోడ్పడుతుందని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. దేశంలో విధాన రూపకల్పన, ప్రణాళిక రచనలో ఈ సమాచారం ఎంతగానో దోహదపడుతుందని ఆయన వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా నిపుణులు, శాస్త్రవేత్తలనుద్దేశించి ఆయన మాట్లాడారు. భారత్ విస్తీర్ణం, వైవిధ్యాలను కేవలం భౌగోళిక, ఆహారం, భాషాపరమైన అంశాల ద్వారానే కాకుండా దేశ ప్రజల జన్యు నిర్మాణం ద్వారానూ ఈ పరిశోధన ఒక స్పష్టతను తెస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా నేడు వ్యాధుల స్వభావ, స్వరూపాలు ఎంతో మార్పు చెందుతున్నందున ప్రభావశీల చికిత్స విధానాల నిర్ణయంలో జనాభా జన్యు క్రమాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యమన్నారు. ఈ నేపథ్యంలో గిరిజన తెగలలో ప్రబలమవుతున్న 'కొడవలి కణ రక్తహీనత' (సికిల్ సెల్ అనీమియా) పెద్ద సవాలు విసురుతున్నదని గుర్తుచేస్తూ, ఈ సమస్య పరిష్కారాన్ని దేశం జాతీయ లక్ష్యంగా నిర్దేశించుకున్నదని స్పష్టం చేశారు. ప్రాంతాల వారీగా సమస్య స్వరూపం మారినా, భారత జనాభాలోని విశిష్ట జన్యు నమూనాలను అర్థం చేసుకోవడంలో జన్యు క్రమ అధ్యయనం పూర్తిస్థాయిలో అవసరమని ఆయన వివరించారు.

నిర్దిష్ట జన సమూహాల విషయంలో నిర్దిష్ట పరిష్కారాల తో పాటు ప్రభావశీల ఔషధ రూపకల్పనకు ఈ అవగాహన తోడ్పడుతుందనీ, ఈ పరిధి చాలా విస్తృతమైనదే అయినా, సికిల్ సెల్ అనీమియా దీనికొక ఉదాహరణ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. ఒక తరం నుండి మరొక తరానికి జన్యుపరంగా సంక్రమించే అనేక వ్యాధులపై మన దేశంలో తగిన అవగాహన లేదనీ, ఈ నేపథ్యంలో అటువంటి వ్యాధులన్నింటికీ సమర్థ చికిత్సా విధానాలను రూపొందించడంలో జీనోమ్ఇండియా ప్రాజెక్ట్ ఉపయోగపడుతుందని విశదీకరించారు.

"ఈ 21వ శతాబ్దంలో జీవ ఆర్థిక వ్యవస్థగా వికసిత భారత్‌కు పునాది వేయడంలో బయో- టెక్నాలజీ, బయోమాస్ సమ్మేళనం కీలకం" అని శ్రీ మోదీ అన్నారు. సహజ వనరుల సముచిత వినియోగం, జీవ ఆధారిత ఉత్పత్తులు-సేవలకు ప్రోత్సాహం, ఈ రంగంలో కొత్త ఉపాధి అవకాశాల సృష్టి తదితరాలు జీవ ఆర్థిక వ్యవస్థ లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు. దేశ సుస్థిర ప్రగతి, ఆవిష్కరణలను జీవ ఆర్థిక వ్యవస్థ వేగవంతం చేస్తుందని ప్రధాని అన్నారు. గడచిన దశాబ్దంలో భారత జీవ ఆర్థిక వ్యవస్థ వేగంగా వృద్ధి చెందిందని, 2014లో దీని విలువ 10 బిలియన్ డాలర్లు కాగా, నేడు 150 బిలియన్ డాలర్లకుపైగా నమోదు కావడమే ఇందుకు నిదర్శనమని ఉదాహరించారు. జీవ ఆర్థిక వ్యవస్థను మరింత ఉన్నత శిఖరాలకు చేర్చే దిశగా భారత్ కృషి చేస్తున్నదని వివరించారు. ఇటీవల 'బయో ఇ3' పేరిట దార్శనిక విధానానికి శ్రీకారం చుట్టడాన్ని ప్రస్తావిస్తూ- ఐటీ విప్లవం తరహాలోనే అంతర్జాతీయ జీవ సాంకేతికరంగంలో భారత్ అగ్రగామిగా ఎదిగేందుకు ఇది తోడ్పడుతుందని శ్రీ మోదీ అన్నారు. ఈ దిశగా కృషిలో శాస్త్రవేత్తల కీలక పాత్రను ఆయన ప్రశంసిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రపంచ ప్రధాన ఔషధ కూడలిగా భారత్ తెచ్చుకున్న గుర్తింపునకు దేశం నేడు కొత్త కోణం జోడించడాన్ని ప్రధాని ప్రముఖంగా ప్రస్తావించారు. దేశ ప్రజారోగ్య సంరక్షణ వ్యవస్థ గడచిన దశాబ్దం నుంచీ విప్లవాత్మక చర్యలు చేపట్టామని గుర్తుచేశారు. లక్షలాదిగా ప్రజానీకానికి దేశం ఉచిత చికిత్స సదుపాయం కల్పించిందని, జనౌషధి కేంద్రాల ద్వారా 80 శాతం తగ్గింపుతో మందులను అందుబాటులో ఉంచిందని వివరించారు. అంతేకాకుండా ఆధునిక వైద్య మౌలిక సదుపాయాలను నిర్మించిందని ప్రధానమంత్రి తెలిపారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో భారత ఔషధావరణ వ్యవస్థ తన శక్తిసామర్థ్యాలను నిరూపించుకుందని చెప్పారు. దేశ ఔషధ తయారీ రంగంలో బలమైన సరఫరా-విలువ శ్రేణుల నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కృషిని జీనోమ్ఇండియా ప్రాజెక్ట్ శక్తిమంతం, వేగవంతం చేయగలదన్నారు.

"అనేక అంతర్జాతీయ సమస్యలకు పరిష్కారాల కోసం ప్రపంచం మన వైపే చూస్తోంది. భవిష్యత్తరాలు దీన్ని అవకాశంగానే కాకుండా బాధ్యతగానూ పరిగణించాలి" అని శ్రీ మోదీ వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్తంగా గత దశాబ్దంలో విద్యారంగంలోని అన్ని స్థాయులలోనూ పరిశోధన- ఆవిష్కరణలపై దేశం నిశితంగా దృష్టి సారించిందని తెలిపారు. తదనుగుణంగా ఒక విస్తృత పరిశోధనావరణ వ్యవస్థకు రూపమిస్తోందని ఆయన వెల్లడించారు.

"దేశంలోని విద్యార్థులు నిత్యం కొత్త ప్రయోగాలు చేసేవిధంగా నేడు 10,000కుపైగా అటల్ టింకరింగ్ పరిశోధన శాలలు ప్రేరణనిస్తున్నాయి" అని శ్రీ మోదీ అన్నారు. అలాగే యువ ఆవిష్కర్తలకు మద్దతుగా దేశమంతటా వందలాది 'అటల్ఇంక్యుబేషన్ సెంటర్లు' ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. విద్యార్థి పరిశోధకుల అధ్యయనం-పరిశోధనకు మద్దతుగా 'పీఎం రీసెర్చ్ ఫెలోషిప్' పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అలాగే బహుళ రంగాల్లోనే కాకుండా అంతర్జాతీయ పరిశోధనలను ప్రోత్సహించేలా జాతీయ పరిశోధన నిధిని ఏర్పాటు చేశామని ప్రధాని తెలిపారు. ఈ మేరకు 'అనుసంధాన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్' శాస్త్రవిజ్ఞాన, ఇంజినీరింగ్, పర్యావరణం, ఆరోగ్యం తదితర రంగాల్లో పరిశోధనలకు మద్దతిస్తుందని చెప్పారు. జీవ సాంకేతిక రంగం పురోగమనానికి, యువ శాస్త్రవేత్తలకు మద్దతిచ్చే భవిష్యత్తరం సాంకేతిక పరిజ్ఞానాలలో పరిశోధనలు- పెట్టుబడులు పెంచడం కోసం ప్రభుత్వం రూ.లక్ష కోట్ల మూలనిధి ఏర్పాటుకు నిర్ణయించినట్లు ప్రధాని వెల్లడించారు.

ప్రభుత్వం ఇటీవల 'ఒన్ నేషన్- ఒన్ సబ్‌స్క్రిప్షన్" పేరిట తీసుకున్న కీలక నిర్ణయాన్ని ప్రస్తావిస్తూ- భారత విద్యార్థులు-పరిశోధకులకు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ జర్నల్స్ సులభంగా, ఖర్చు లేకుండా లభించేందుకు ఇది దోహదం చేస్తుందన్నారు. ప్రస్తుత 21వ శతాబ్దంలో మన దేశాన్ని విజ్ఞాన, ఆవిష్కరణల కూడలిగా మార్చడంలో ఈ కృషి ఎంతగానో తోడ్పడుతుందని ప్రధాని స్పష్టం చేశారు."భారత ప్రజాహిత పరిపాలన, పౌర డిజిటల్ మౌలిక సదుపాయాలు ప్రపంచానికి కొత్త నమూనాను అందించాయి" అని వ్యాఖ్యానించారు. ఈ తరహాలోనే జన్యు పరిశోధన రంగంలోనూ భారత ప్రతిష్ఠను జీనోమ్ఇండియా ప్రాజెక్ట్ మరింత బలోపేతం చేస్తుందని ప్రగాఢంగా విశ్వసిస్తున్నానంటూ ప్రధానమంత్రి తన ప్రసంగం ముగించారు. చివరగా ఈ ప్రాజెక్టు మరింత విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# ఇంతకు ముందు ఎన్నడూలేనంత స్పందన 2.7 కోట్లను మించిన రిజిస్ట్రేషన్లు

న్యూఢిల్లీ, జనవరి 10:విద్యార్థినీ విద్యార్థుల్లో పరీక్షలకు సంబంధించిన ఒత్తిడిని తగ్గించి, పరీక్షలకు సన్నద్ధమయ్యే ప్రక్రియను నేర్చుకోవడంగానూ, అదే సమయంలో ఒక సంబరంగా జరుపుకొనేలాగానూ మార్చివేసే ఉద్దేశంతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ మొదలుపెట్టిన 'పరీక్షా పే చర్చా' (పీపీసీ) కార్యక్రమం దేశ వ్యాప్తంగా ఒక ఉద్యమం తరహాలో వర్ధిల్లుతోంది. పీపీసీ 2025 ఈ కార్యక్రమంలో 8వ సంచిక. దీనిలో పాల్గొనడానికి భారతదేశం నుంచే కాక విదేశాల నుంచి కూడా విద్యార్థినీ విద్యార్థులు, టీచర్లు, విద్యార్థుల తల్లితండ్రులు 2.79 కోట్ల మందికి పైగా వారి పేర్లను నమోదు చేసుకొన్నారు. ఈ అసాధారణ ప్రతిస్పందనను పరిశీలిస్తే ఈ కార్యక్రమం సిసలైన 'జన్ ఆందోళన్' (ప్రజా ఉద్యమం)గా అంతకంతకూ ఆదరణను పెంచుకొంటోందని స్పష్టమవుతోంది.

పీపీసీ 2025 లో పాల్గొనడానికి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మైగవ్‌డాట్ఇన్ (ఓఎఉనీల.తిని) పోర్టల్‌లో స్వీకరిస్తున్నారు. కిందటి ఏడాదిలో డిసెంబర్ 14న రిజిస్ట్రేషన్ల స్వీకరణను మొదలుపెట్టారు. రిజిస్ట్రేషన్లు చేసుకొనేందుకు ఈ సంవత్సరం జనవరి నెల 14 వరకు కూడా అవకాశముంది. ఈ కార్యక్రమానికి విస్తృత స్థాయిలో లభిస్తున్న ఆదరణను గమనిస్తే, ఇది విద్యార్థుల మానసిక అభ్యున్నతికి బాటపరచి పరీక్షలంటే వారిలో ఒక సానుకూల దృక్పథాన్ని పెంచడంలో విజయం సాధించిందని స్పష్టమవుతోంది.

ప్రతినిధులు ముఖాముఖీగా పాలుపంచుకొనే ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖలోని పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం ఏటా నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమమంటే విద్యార్జన రంగంలో చాలా మంది ఎంతో ఆసక్తితో ఎదురుచూసే పండుగలాంటి స్థితి ఏర్పడింది. పీపీసీ 7వ సంచికను 2024లో న్యూఢిల్లీ లోని ప్రగతి మైదాన్‌లో భారత్ మండపంలో ఓ టౌన్ హాల్ ఫార్మేట్‌లో నిర్వహించగా, ఈ కార్యక్రమానికి విస్తృత ప్రశంసలు లభించాయి.

పీపీసీ స్ఫూర్తికి అనుగుణంగా 2025 జనవరి 12వతేదీ (జాతీయ యువ దినోత్సవం) మొదలు 2025 జనవరి 23 (నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి) వరకు పాఠశాల స్థాయిలో విద్యార్థులు పాల్గొనే వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. విద్యార్థుల్లో సమగ్ర అభివృద్ధికి ఊతాన్నిచ్చి, వారు పరీక్షలకు హాజరు కావడాన్ని ఒక ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారన్న భావనను కలగజేయాలన్నదే ఈ కార్యక్రమాల ఉద్దేశం. ఈ కార్యకలా పాల్లో ఈ కింద ప్రస్తావించినవి భాగంగా ఉంటాయి:ఈ కార్యక్రమాల ద్వారా దృఢత్వం, సానుకూల మనస్తత్వం, నేర్చుకోవడంలో ఆనందం.. అనే అంశాలు నిండిన సందేశాన్ని పీపీసీ 2025 అందిస్తూ, విద్యార్జనను ఒత్తిడితో కూడిన పని అనే భావనకు లోనవడానికి బదులు ఒక యాత్ర మాదిరిగా ఆనందిస్తూ పూర్తి చేయాలని సూచిస్తున్నదని చెప్పుకోవచ్చన్నమాట. మరిన్ని వివరాలు తెలుసుకోవాలన్నా, ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్న ఆసక్తి ఉన్న వారు మైగవ్ పోర్టల్ (ఓఎఉనీల.తిని)ను సందర్శించి, ఈ మార్పు ప్రధాన కార్యక్రమంలో పాలుపంచుకోవచ్చు.


ఆహ్వానం

తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ సాహిత్య అకాడమి మరియు ధర్మకేతనం సాహిత్య కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో..

మరువంపువూల మట్టితీగ

(ఎన్వీ రఘువీర్ ప్రతాప్ కవిత్వంపై వ్యాసావళి)

పుస్తకావిష్కరణ మరియు పురస్కారాల ప్రదానోత్సవ సభ

తేది: 12-01-2025 ఆదివారం సా॥ 5:00 లకు

వేదిక : రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్, హైద్రాబాద్

బ్రహ్మశ్రీ నారాయణదాసు శ్రీ రామాచార్యులు స్మారక సాహితీ పురస్కారం
2023 - డా॥ వి.జయ ప్రకాశ్ గారు
2024 - అవధాని శ్రీ అవుసుల భానుప్రకాశ్ గారు

శ్రీమతి నారాయణదాసు వెంకట శేషమ్మ స్మారక సాహితీ పురస్కారం
2023 - శ్రీమతి వావిలి కొలను రాజ్యలక్ష్మి గారు
2024 - డా॥ తూర్లపాటి రాజేశ్వరి గారు

సభాధ్యక్షులు : డా॥ నామోజు బాలాచారి గారు, కార్యదర్శి, తెలంగాణ సాహిత్య అకాడమీ
ముఖ్య అతిథి : డా॥ కె.వి.రమణ ఐ.ఏ.ఎస్., రిటైర్డ్ గారు, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు
ప్రత్యేక ఆహ్వానితులు : ఆచార్య డా॥ కొలకలూరి ఇనాక్ గారు, పద్మశ్రీ అవార్డు గ్రహీత, పూర్వ ఉపాధ్యక్షులు, తిరుపతి యూనివర్సిటీ
విశిష్ట అతిథి : డా॥ మామిడి హరికృష్ణ గారు, సంచాలకులు, తెలంగాణ భాషా సంస్కృతికశాఖ
గౌరవ అతిథులు : డా॥ అమ్మంగి వేణుగోపాల్ గారు, ప్రముఖ కవి, కాళోజి నారాయణరావు తొలి పురస్కార గ్రహీత
శ్రీ బైస దేవదాసు గారు, నేటి నిజం సంపాదకులు
ఆత్మీయ అతిథులు : డా॥ తండు కృష్ణ కౌండిన్య గారు, అధ్యక్షులు తెలుగుశాఖ, రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల
శ్రీ పెరుమాళ్ళ ఆనంద్ గారు, అధ్యక్షులు, సృజన సాహితి
పుస్తక సమీక్ష : శ్రీమతి కొండపల్లి నిహారిణి గారు, రచయిత్రి, మయూఖ పత్రిక సంపాదకురాలు
సభా సమన్వయం : పెద్దూరి వెంకటదాసు గారు, కవి, రచయిత


# చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి క్వాష్ పిటిషన్ కొట్టివేత

అమరావతి, జనవరి 10:పోక్సో కేసుకు సంబంధించి వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. బాలికపై అత్యాచారం జరిగినట్లు అసత్య ప్రచారం చేశారని ఆయనపై కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన పిటిషన్ వేయగా హైకోర్టు కొట్టివేసింది.

# ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసే బిజెపి అభ్యర్థులు వీరే..

హైదరాబాద్, జనవరి 10: తెలంగాణలో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు జరిగే ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులను బీజేపీ ప్రకటించింది.. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఒక ప్రకటనను విడుదల చేశారు..నల్గొండ - ఖమ్మం - వరంగల్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నరోత్తం రెడ్డికరీంనగర్ - మెదక్ - ఆదిలాబాద్ - నిజామాబాద్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొమురయ్య

కరీంనగర్ - మెదక్ - ఆదిలాబాద్ - నిజామాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి.

# సీఎం చొరవతో గాయపడిన మనుషులకు ఉపశమనం




తిరుపతి, జనవరి 10:టోకెన్ల పంపిణీలో తొక్కిసలాటకు గురై గాయపడిన భక్తుల హృదయాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఈరోజు ఉపశమనం లభించింది. తిరుమల వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చిన భక్తుల తొక్కిసలాటలో ఆరుగురు మృత్యువాత పడగా.. మరో 34మంది ఆసుపత్రిపాలైన విషయం తెలిసిందే.

ఘటన జరిగినప్పటి నుంచి ఫాలో అప్ చేస్తూ తగిన ఆదేశాలు ఇస్తూ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నిన్న స్వయంగా వచ్చి పలు రకాల చర్యలు తీసుకున్న విషయం విదితమే. అందులో భాగంగా గాయపడిన వారికి టీటీడీతో నగదు పరిహారం ఇప్పించడంతో పాటు వారి కోరిక మేరకు ఈరోజు వారికి వైకుంఠ ద్వార దర్శనం చేయించమని ఆదేశించారు. అటు తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) అధికారవర్గం, జిల్లా అధికార యంత్రాంగం ఈరోజు గాయపడి డిశ్చార్జ్ అయిన 36మందికి, వారితో వచ్చిన వారికి తిరుమలలో ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసారు.

జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు వారి కోసం ప్రత్యేకంగా బస్సులు, కార్లు సిద్ధం చేసి వారి వారి ఊళ్లకు పంపించారు. ఆ సందర్భంగా తొక్కిసలాట బాధితులు అధికారులకు కృతజ్ఞతలు తెలియచేసి సంతృప్తిని వ్యక్తం చేసారు. ఆ విధంగా భగవంతుని దర్శనానికి వచ్చి తొక్కిసలాటకు గురై రెండురోజుల పాటు తీవ్ర ఆవేదనకు గురైన బాధితులు అధికారుల ఉపశమన చర్యలతో సంతృప్తి చెంది స్వస్థలాలకు బయలుదేరారు.

# నిర్మాణ రంగానికి చేయూత ఇస్తాం .. 20 లక్షల మందికి ఉపాధి కల్పిస్తాం: చంద్రబాబు




**-నరెడ్కో ప్రాపర్టీ షోలో సీఎం చంద్రబాబు వెల్లడి**
**-ఇప్పటికే ఈ రంగానికి 4 లక్షల పెట్టుబడులు వచ్చాయి**
**-ఈ రంగంపై 34 లక్షల మంది ఆదారపడి ఉన్నారు**
**-రియల్ ఎస్టేట్ రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాం**
**-కేంద్రం సహకారంతో పెద్ద ఎత్తున నిర్మాణాలు**

గుంటూరు, జనవరి 10: పూర్తిగా పతనమైన భవన నిర్మాణ రంగాన్ని గాడిలో పెట్టేపనిలో ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు.. గత అయిదేళ్లలో ఈ రంగం పూర్తిగా పతనమైందన్నారు. 34 లక్షల మందికి పైగా ఈ రంగంపై ఆధారపడి ఉన్నారని, దీంతో దీనిపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని చెప్పారు. గుంటూరులోని చేబ్రోలు హనుమయ్య మైదానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నరెడ్కో ప్రాపర్టీ షోను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత పాలకులు అన్ని రంగాలనూ పతనావస్థకు తీసుకొచ్చారని.. రాష్ట్రాన్ని సమస్యల వలయంగా మార్చేశారని విమర్శించారు. పడకేసిన నిర్మాణ రంగాన్ని మళ్లీ పైకి తీసుకొస్తామని స్పష్టం చేశారు.

### అందుకే ఉచిత ఇసుక పాలసీ..

కొత్త ఏడాది నిర్మాణ రంగం వేగంగా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రంగం అధ్వానంగా మారిందన్నారు. అధికారంలోకి రాగానే రాష్ట్ర పునర్ నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. ప్రధాని మోదీ విశాఖకు వచ్చి ?2లక్షల కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారని గుర్తు చేశారు. బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ ఇప్పుడిప్పుడే ముందుకెళ్తుందని చెప్పారు. నిర్మాణ రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు.. 34లక్షల మంది ఆధారపడి ఉన్న ఈ రంగాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, ఉచిత ఇసుక విధానం తెచ్చామని అన్నారు. ఈ రంగం అభివృధికి నరెడ్కో, క్రెడాయ్ వంటి సంస్థలు కలిసి ముందుకు రావాలని పిలుపుఇచ్చారు. ఇదే సందర్భంగా రియల్ ఎస్టేట్ సమస్యల పరిష్కారానికి ముందుంటామని హామీ ఇచ్చారు..

### భూ అక్రమాలతో ఇబ్బందులు ..

గత ప్రభుత్వం చేసిన భూకబ్జాలతో అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ఎప్పుడూ చూడనివిధంగా భూ సమస్యలపై దరఖాస్తులు వస్తున్నాయని అన్నారు. భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత ప్రభుత్వ నిర్వాకంతో టీడీఆర్ బాండ్లు తీసుకుని కొంతమంది నష్టపోయారని తెలిపారు.

### నాలుగు లక్షల కోట్ల పెట్టుబడులు..

స్వర్ణాంధ్ర విజన్ డాక్యుమెంట్ సాధన కోసం కృషి చేస్తున్నామని సీఎం చెప్పారు.. తాము వచ్చాక ?4లక్షల కోట్ల పెట్టుబడులకు సంతకాలు చేశామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో 20లక్షల మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.

# మత్స్యకారుల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి.. బైరెడ్డి శబరి

అమరావతి, జనవరి 10: రాష్ట్రంలోని మత్స్యకారుల అభివృద్ధి కోసం ఉమ్మడి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి పేర్కొన్నారు. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిద్యాల మండలంలోని నెహ్రూ నగర్ గ్రామంలో మత్స్యశాఖ ఆధ్వర్యంలో శ్రీశైలం బ్యాక్ వాటర్ జలాశయంలో చేపపిల్లలు వదిలే కార్యక్రమం శుక్రవారం చేపట్టారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మత్స్యకారుల ఆర్థిక ప్రగతికి ఇలాంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. మన ప్రభుత్వం మత్స్యకారుల అభ్యున్నతికి నూతన పథకాలు ప్రవేశపెడుతూ, వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించేందుకు కట్టుబడి ఉందని పేర్కొన్నారు. మత్స్యకారుల జీవితాల్లో వెలుగులతో కూడిన మార్పులు తీసుకురావటమే ప్రధాన లక్ష్యంగా మత్స్యశాఖ చర్యలు చేపడుతుందని తెలిపారు.

ఉమ్మడి కర్నూలు జిల్లా డీఎఫ్‌సీఎస్ చైర్మన్ బియస్ నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈకార్యక్రమం జలవనరుల సమర్థ వినియోగంతో పాటు మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడంలో దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ రాఘవ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ ఆఫీసర్ శ్యామల, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ సంధ్యారాణి, పగిడాల ఎంపీడీవో సుమిత్రమ్మ, నెహ్రూ నగర్ సర్పంచ్ కూరాకుల రాజేశ్వరి, స్థానిక మత్స్యకారులు పాల్గొన్నారు.

# కొత్త ఫీచర్ల వల్ల ఆర్టీఐ పోర్టల్ పనితీరుపై ఎటువంటి ప్రతికూల ప్రభావం లేదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జనవరి 10:సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పోర్టల్ పనితీరుపై అందిన సందేహాలను సమీక్షించిన సిబ్బంది, శిక్షణల విభాగం, ఓటీపీ(వన్ టైమ్ పాస్ వర్డ్) ఫీచర్ ను జోడించిన అనంతరం పోర్టల్ యధావిధిగా పనిచేస్తోందని, ఇప్పుడు మరింత మెరుగైన తీరులో కొనసాగుతోందని స్పష్టం చేసింది. పోర్టల్ కు కొత్తగా జోడించిన మెరుగైన భద్రత నియమావళి సహా అన్నీ ఫీచర్లు సక్రమంగా పనిచేస్తున్నాయని, వీటిని ఉపయోగించడం మరింత సులువయ్యిందని సమగ్ర సమీక్ష జరిపిన అనంతరం డీఓపీటీ తెలియజేసింది.

ఆర్‌టిఐ పనితీరుపై అందిన ఫిర్యాదులకు స్పందిస్తూ, జనవరి 2వ తేదీన జోడించిన ఓటీపీ ఫీచర్, వేదిక వినియోగదారుల ధ్రువీకరణ కోసమే కాక సమాచార హక్కు వినతి పత్రాల్లోని వ్యక్తిగత సమాచార భద్రత కోసమేనని డీఓపీటీ స్పష్టం చేసింది. ధ్రువీకరణ పొందిన వారికే పోర్టల్లో ప్రవేశం కల్పించడం ద్వారా సైబర్ భద్రత మెరుగవుతుందని, ఇవి సంస్థ అమలు చేసే ఉత్తమ పద్ధతులకు అనుగుణమైన చర్యలని తెలిపింది.

ఓటీపీలు అందడం ఆలస్యం అవుతోందన్న ఫిర్యాదులు అందడంతో, ఎన్ఐసీ ఈమెయిల్ డొమైన్ ద్వారా ఓటీపీలు ఎప్పటికప్పుడు పంపిణీ అవుతాయని వివరించిన డీఓపీటీ... ఎన్ఐసీ సర్వర్లపై కానీ, జీమెయిల్, యాహూ మెయిల్ వంటి ఇతర సర్వర్లపై కానీ అధిక ట్రాఫిక్ నమోదు అయిన సందర్భాల్లో అరుదుగా ఓటీపీలు ఆలస్యంగా అందే అవకాశం ఉందని చెప్పింది. ముఖ్యంగా ఓటీపీ ని ఎంటర్ చేసేంత వరకూ వాటిని నమోదు చేయడానికి వీలుకాకుండాపోయే అవకాశం లేదని, ఓటీపీ అందటం ఆలస్యం అయిన సందర్భాల్లో సైతం, అందిన వెంటనే ఓటీపీని యూజర్లు వినియోగించుకుని తమ దరఖాస్తు స్థితిని తెలుసుకోగలుగుతారని వివరించింది.

జనవరి 9వ తేదీ, ఉదయం 10.55 వరకూ 9,782 వినియోగదారులు కొత్త పద్ధతిని ఉపయోగించి తమ దరఖాస్తు పరిస్థితిని తెలుసుకున్నారని, దీంతో కొత్త పద్ధతి సజావుగా పనిచేస్తోందని నిర్ధారణ అయ్యిందని విభాగం తెలిపింది.

అదనంగా మరో మెట్టు జోడించడం వల్ల ప్రక్రియ జటిలమైందన్న కొందరి విమర్శకు సమాధానమిస్తూ... వినియోగదారుల వ్యక్తిగత గోప్యతను కాపాడేందుకు కొత్త ఫీచర్ అనివార్యమని, కొత్త ప్రక్రియలు సజావుగా పనిచేస్తున్నాయన్న నిర్ధారణ కోసం పలు దఫాల్లో పరీక్షలు నిర్వహించామని చెప్పింది.

హెల్ప్ లైన్లు అందుబాటులో లేవన్న ఫిర్యాదులకు స్పందిస్తూ, 011-24622461 అనే ఆర్టీఐ హెల్ప్ డెస్క్ నంబర్ కు కార్యాలయ వేళల్లో (ప్రభుత్వ సెలవుదినాలు తప్ప, సోమవారం నుంచీ శుక్రవారం వరకూ, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 లోపు) ఫోన్ చేసి తక్షణ సహాయం పొందవచ్చని స్పష్టం చేసింది.

పౌరులకు పారదర్శకమైన, అందుబాటులో ఉండే సేవలను అందించేందుకు కట్టుబడి ఉన్నామని డీఓపీటీ స్పష్టం చేసింది. వినియోగదారుల సంతృప్తి తమకు ముఖ్యమని, ప్రక్రియలన్నీ మరింత సమర్థంగా పనిచేస్తున్నాయో లేవో తెలుసుకునేందుకు ఆర్టీఐ పోర్టల్ పై పర్యవేక్షణ కొనసాగుతోందని డీఓపీటీ హామీ ఇచ్చింది. ఆర్టీఐ చట్టం కింద పౌరుల హక్కుల పరిరక్షణ సహా డిజిటల్ సేవల విస్తరణ, మెరుగుదల లక్ష్యాలుగా ప్రభుత్వం తీసుకుంటున్న అనేక చర్యల్లో భాగంగా కొత్త ఫీచర్ల జోడింపు ప్రక్రియ చేపట్టామని డీఓపీటీ తెలిపింది.

# స్కామ్ లలో గత ప్రభుత్వం సరికొత్త రికార్డ్ - పవన్ కల్యాణ్

**–వాటిని సరి దిద్దే పనిలో కూటమి ప్రభుత్వం**
**–తిరుపతి ఘటనపై మరోసారి సారీ**
**–తప్పు ఎవరు చేసినా శిక్ష పడాల్సిందే**
**–అందరూ బాధ్యతలు సక్రమంగా నిర్వర్తించాలి**
**–పిఠాపురంలో గోకులం సభలో పవన్ కల్యాణ్**



అమరావతి, జనవరి 10:గత ప్రభుత్వం స్కామ్ ల్లో రికార్డు సృష్టించిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రస్తుతం వాటిని సరిదిద్దే పనిలో ఉన్నామని చెప్పారు. పిఠాపురం మండలం కుమారపురంలో కృష్ణుడి ఆలయం వద్ద నిర్మించిన మినీ గోకులంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మించిన 12,500 మినీ గోకులం షెడ్లను ఇక్కడి నుంచి నేడు లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివా కలెక్టర్ షాన్మోహన్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం

పిఠాపురం మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సభలో పవన్ ప్రసంగిస్తూ, శ్రమ ఉన్న చోటే పెట్టుబడులు వస్తాయని చెప్పారు.. రైతుల ఆదాయం రెట్టింపయ్యేలా ఆలోచనలు చేస్తున్నామన్నారు.. దీనిలో బాగంగానే పశు సంపదను పెంచే వథకాలను అమలు చేస్తున్నామన్నారు.. పశు పోషణతో రైతులు ఆర్ధికంగా స్థిరపడతారన్నారు..

**తిరుమలలో ఘటన .. మరోసారి సారీ**

తిరుపతి ఘటనపై పవన్ కల్యాణ్ మరోసారి సారీ చెప్పారు. తప్పు జరిగితే అది మా అందరి సమష్టి బాధ్యతగా తీసుకోవాలని కోరారు. అందుకే తిరుపతి ఘటనపై మన స్ఫూర్తిగా క్షమాపణ కోరానన్నారు.. టోకేన్ల జారీ వద్ద బాధ్యతలు నిర్వహిస్తున్న డిఎస్పీ సక్రమంగా బాధ్యతలు నిర్వహించకపోవడంతోనే తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు బదిలీ అయ్యారన్నారు..కింద స్థాయి అధికారి తప్పుకు పై స్థాయి అధికారిపై వేటు పడిందన్నారు.. ఎస్పీ సుబ్బరాయుడు బదిలీ తనను బాధించిందని చెప్పుకొచ్చారు పవన్ కల్యాణ్.. ఇదే సమయంలో తిరుమల తొక్కిసలాట ఘటన పై టీటీడీ ఛైర్మన్, సభ్యులు ప్రెస్ మీట్ పెట్టి క్షమాపణ చెప్పాలని సూచించారు. తానే క్షమాపణ చెప్పినప్పుడు.. మీకు చెప్ప డానికి నామోషీ ఏమిటని ప్రశ్నించా రు. తాను మాత్రమే దోషిగా నిలబ డాలా.. అని ప్రశ్నించారు. వీఐపీ ట్రీట్మెంట్ తగ్గించాలని.. కామన్ మేన్ ట్రీట్మెంట్ పెంచాలని చెప్పారు.

ఇక ఉద్యోగి, అధికారి.. ఎవరైనా వారి బాధ్యతలు సరిగా నిర్వర్తించాలని సూచించారు. . గత ప్రభుత్వంలో అలవాటుపడి కొందరు పనిచేయడం మానేశారని ఆక్షేపించారు. న్యాయం అందరికీ జరిగేలా చూడటం ముఖ్యమని అంటూ తప్పు చేస్తే తనను కూడా శిక్షించాలని కోరారు డిప్యూటీ సిఎం.

# మహా కుంభమేళా ఇతివృత్తంగా ఆకాశవాణి, దూరదర్శన్ సంస్థలు నిర్మించిన పాటలను విడుదల చేసిన కేంద్ర సమాచార ప్రసార శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్

న్యూఢిల్లీ, జనవరి 10:2025 మహా కుంభమేళా కోసం "మహా కుంభ్ హై.." పేరిట దూరదర్శన్ నిర్మించిన ప్రత్యేక గీతాన్ని కేంద్ర సమాచార, ప్రసారశాఖ, రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖల మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ న్యూఢిల్లీ లో ఏర్పాటైన ఒక కార్యక్రమంలో విడుదల చేశారు.

భక్తి, సంప్రదాయం, వేడుకల త్రివేణీ సంగమంగా మహాకుంభ మేళాకు స్వర హారతి

సుప్రసిద్ధ గాయకుడు, పద్మశ్రీ పురస్కార గ్రహీత కైలాష్ ఖేర్ పాడిన "మహా కుంభ్ హై.." పాట, కుంభమేళాతో అల్లుకున్న భక్తి భావం, వేడుకలు, సాంస్కృతిక వైభవాన్ని అద్వితీయంగా చాటుతోంది. మహా కుంభ్ లో ముప్పేటగా అల్లుకుపోయే విశ్వాసం, సంప్రదాయాలు, పండుగ వాతావరణాన్ని ప్రఖ్యాత రచయిత ఆలోక్ శ్రీవాస్తవ రచన ప్రతిబింబిస్తూండగా, మనసులో భక్తి భావాలను పెంపొందించే అద్వితీయ సంగీతాన్ని క్షితిజ్ తారే కూర్చారు.

దేశ సాంస్కృతిక వారసత్వానికి, తరాలు మారినా తరగని ప్రాముఖ్యం గల కుంభమేళాకు వందనాలు అర్పించే ఈ పాట, సాంప్రదాయక బాణీలు, కొంగొత్త వాయిద్య రీతుల మేలుకలయికగా ఉంది.

మహాకుంభ్ హై.." పాట అధికారిక మ్యూజిక్ వీడియోను ఇప్పుడు దూరదర్శన్ ద్వారానే కాక, సంస్థ డిజిటల్ వేదికలపై కూడా వీక్షించవచ్చు.

ప్రయాగరాజ్ మహాకుంభమేళా కోసం ఆకాశవాణి సిద్ధం చేసిన ప్రత్యేక గీతం విడుదల

"జై మహాకుంభ్ జై మహాకుంభ్, పగ్ పగ్ జయకారా మహాకుంభ్ ..."

ప్రయాగరాజ్ లో జరిగే మహా కుంభ్ కోసం ఆకాశవాణి ప్రత్యేకంగా రూపొందించిన గీతాన్ని కేంద్ర సమాచార, ప్రసార శాఖల మంత్రి విడుదల చేశారు. చక్కని సంగీతం, రచనల సంగమంగా రూపుదిద్దుకున్న ఈ పాట కుంభమేళా ఆధ్యాత్మిక, సాంస్కృతిక, ధార్మిక ప్రాముఖ్యాన్ని చాటుతోంది.

ప్రయాగరాజ్ పవిత్ర త్రివేణీ సంగమం వద్ద నిర్వహించే మహాకుంభమేళా వైభవానికి ఈ గీతం నమస్సులు అర్పిస్తోంది. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన ఈ సమ్మేళన వైశిష్ట్యాన్ని పాట గొప్పగా వ్యక్తీకరిస్తోందన్నది భక్తుల మాట. లక్షలాది భక్తుల దైవస్మరణతో మార్మోగుతున్న ప్రయాగరాజ్ నేల, మహాకుంభ్ ప్రారంభం కోసం గర్వంగా ఉద్విగ్నంగా ఎదురుచూస్తోంది...

సంతోష్ నహార్, రతన్ ప్రసన్నల జోడీ సంగీతం అందించిన ఈ గీతం, రతన్ ప్రసన్న భక్తిపూర్వక గానంతో ప్రాణం పోసుకుంది. చైతన్యానికి ప్రతీకగా నిలిచిన అభినయ్ శ్రీవాస్తవ రచన, దైవంతో మానవుడి ఆధ్యాత్మిక బంధాన్ని తెలియజేస్తోంది.

త్రివేణీ సంగమం వద్ద ఆచరించే పవిత్ర స్నానం, ఆత్మలను శుద్ధి చేసే శక్తిగలదని, ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని కలిగించే సాధనమని గీతం గుర్తు చేస్తోంది. అచిరకాలంగా కొనసాగుతున్న మహాకుంభమేళా సంప్రదాయాన్ని గౌరవిస్తూ ఆకాశవాణి విడుదల చేసిన ఈ గీతం శ్రోతల మనసులను భక్తిభావంతో, గర్వంతో నింపుతోంది.

భారతదేశ సాంస్కృతిక ఔన్నత్యానికి, ఆధ్యాత్మిక వారసత్వానికీ ప్రతీక అయిన ఈ రెండు గీతాలను ఆస్వాదించేందుకు శ్రోతలు, వీక్షకులు ఎదురుచూడొచ్చు.

# జంతు సంరక్షణ ప్రతినిధుల శిక్షణకై భారత పశు సంరక్షణ బోర్డు, నల్సార్ విశ్వవిద్యాలయం మధ్య అవగాహన ఒప్పందం

న్యూఢిల్లీ, జనవరి 10:పశు సంవర్ధక, పాడిపరిశ్రమ విభాగంలోని చట్టబద్ధ సంస్థ అయిన భారత పశు సంరక్షణ బోర్డు (ఏడబ్ల్యూబీఐ), మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ మంత్రిత్వ శాఖ ఈ రోజు హైదరాబాద్‌లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై ఏడబ్ల్యూబీఐ ఛైర్మన్ డాక్టర్ అభిజిత్ మిత్ర, నల్సార్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శ్రీకృష్ణ దేవరావు సంతకాలు చేశారు.

జిల్లా జంతు హింస నివారణా సంఘాలు (ఎస్పీసీఏ), రాష్ట్ర పశు సంరక్షణ బోర్డులు పశు సంక్షేమానికి చేస్తున్న కార్యక్రమాలకు మద్దతిస్తున్న వారికి నాణ్యమైన న్యాయ నైపుణ్య శిక్షణ అందించే వ్యూహాత్మక భాగస్వామ్యంగా ఈ అధికారిక ఒప్పందం కుదిరింది. ఏడబ్ల్యూబీఐ, హైదరాబాద్ లోని నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం మధ్య కుదిరిన ఈ ఒప్పందం ద్వారా ఆనరరీ యానిమల్ వెల్ఫేర్ రిప్రజెంటేటివ్ – గౌరవ పశు సంరక్షణ ప్రతినిధి (హెచ్ఏడబ్ల్యూఆర్) దరఖాస్తుదారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తారు. దీనిలో భాగంగా జంతు సంరక్షణ చట్టాలు, విధానాలు, పరిశోధన మెలకువలు, సంబంధిత ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారు. బృందాల వారీగా అందించే ఈ శిక్షణలో ఒక్కో సెషన్లో గరిష్టంగా 25 మంది చొప్పున పాల్గొంటారు. కనీసం మూడు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుంది. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసిన వారికి, నల్సార్ నిర్వహించిన పరీక్షల ఆధారంగా ఆనరరీ యానిమల్ వెల్ఫేర్ రిప్రజెంటేటివ్ (హెచ్ఏడబ్ల్యూఆర్) సర్టిఫికేట్లను ఏడబ్ల్యూబీఐ అందిస్తుంది. శిక్షణాంశాలకు సంబంధించిన మేధోహక్కులు పూర్తిగా నల్సార్ విశ్వవిద్యాలయానికే చెందుతాయి. ఈ అంశాలను హెచ్ఏడబ్ల్యూఆర్ శిక్షణ కోసం ఉపయోగించుకొనే ప్రత్యేక హక్కులు ఏడబ్ల్యూబీఐకి ఉన్నాయి. ఏడబ్ల్యూబీఐ, నల్సార్ మధ్య కుదిరిన భాగస్వామ్య ఒప్పందం దేశంలో పశు సంక్షేమంలో న్యాయవ్యవస్థను సుసంపన్నం చేసే దిశగా వేసిన ముందడుగును సూచిస్తుంది.

హైదరాబాద్లోని నేషనల్ యానిమల్ రీసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రిసెర్చ్ (ఎన్ఏఆర్ఎఫ్బీఆర్)లో ఏడబ్ల్యూబీఐ ఈ రోజు 53 వ సాధారణ సమావేశాన్ని నిర్వహించింది. దేశంలో పశు సంక్షేమాన్ని ప్రోత్సహించడంతో సహా వివిధ సంస్థాగత అంశాలపై చర్చించారు. జనవరి 14 నుంచి 30 వరకు పశు సంక్షేమ పక్షోత్సవాలను దేశవ్యాప్తంగా ఏడబ్ల్యూబీఐ నిర్వహిస్తుంది. జీవ వైవిధ్యం, పర్యావరణ వ్యవస్థలో జంతువులు పోషిస్తున్న ముఖ్యమైన పాత్రను ఈ కార్యక్రమం తెలియజేస్తుంది.

జంతు సంరక్షణ ప్రతినిధుల గురించి

జంతు సంక్షేమం కోసం అంకితమైన పౌర సమాజంలోని ముఖ్యమైన సభ్యులే ఈ గౌరవ జంతు సంరక్షణ ప్రతినిధులు (హెచ్ఏడబ్ల్యూఆర్). పశువులకు అయిన గాయాలు, వాటితో అధిక బరువులను మోయించడం, అమానుషంగా ప్రవర్తించడం లాంటి జంతు హింసకు సంబంధించిన అంశాలపై వారు పనిచేస్తారు.

అలాగే వాటికి ప్రథమ చికిత్సను అందించడం, ప్రజల్లో అవగాహన పెంపొందించడం, చట్టాలకు లోబడి పశువుల రవాణా జరిగేలా చూస్తారు. పశువులకు ఆవాసాలను ఏర్పాటు చేయడానికి, ప్రకృతి విపత్తుల సమయంలో రక్షణ కార్యక్రమాలు చేపట్టడానికి, జంతువులను హింసించే క్రీడలను నిలువరించడానికి ప్రాంతీయ యంత్రాంగంతో కలసి హెచ్ఏడబ్ల్యూఆర్‌లు పని చేస్తారు. వారు చేస్తున్న ప్రయత్నాలు దేశవ్యాప్తంగా పశువుల పరిస్థితిలో మార్పులు తీసుకువస్తాయి. అలాగే కరుణతో నిండిన, బాధ్యాయుతమైన జంతు సంరక్షణా సంస్కృతిని ప్రోత్సహిస్తాయి.

ఏడబ్ల్యూబీఐ, పీసీఏ చట్టం 1960 గురించి

జంతువులపై క్రూరత్వ నిషేధ (పీసీఏ) చట్టం–1960 సెక్షన్ 4 ప్రకారం ఏడబ్ల్యూబీఐను ఏర్పాటు చేశారు.

జంతు సంక్షేమాన్ని ప్రోత్సహిస్తూ, హింస నుంచి వాటిని కాపాడేందుకే ఇది ఏర్పాటయింది. దేశవ్యాప్తంగా జంతువులపై హింసను నిరోధించడం, పెంపుడు, అటవీ జంతువులను సంరక్షించడమే లక్ష్యంగా పీసీఏ చట్టం–1960 పనిచేస్తుంది. రవాణా, ప్రయోగాలు, ప్రదర్శనల సమయంలో యజమానుల నుంచి ఎదురయ్యే హింస నుంచి వాటిని రక్షించడం కూడా దీనిలో భాగం. జంతు సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు జంతువులతో మమేకమయ్యే వారికి శిక్షణ ఇవ్వడంపై ఈ చట్టం దృష్టి సారిస్తుంది.

# పోలీసు పరిశోధన, అభివృద్ధి విభాగం సమీక్షకు అధ్యక్షత వహించిన హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, జనవరి 10:ఈ రోజు న్యూఢిల్లీలో జరిగిన పోలీసు పరిశోధన, అభివృద్ధి విభాగం (బీపీఆర్డీ) సమీక్షా సమావేశానికి కేంద్ర హోం వ్యవహారాలు, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా అధ్యక్షత వహించారు. కేంద్ర హోం కార్యదర్శి, బీపీఆర్డీ డైరెక్టర్ జనరల్, హోం మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నతాధికారులు, బ్యూరో అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

బీపీఆర్డీకి చెందిన ఆరు విభాగాలతో పాటుగా ఇతర యూనిట్లు (సీఏపీటీ భోపాల్, సీడీటీఐలు), అవి సాధించిన విజయాలు, కొనసాగుతున్న పనులు, భవిష్యత్తు ప్రణాళికలను హోం మంత్రి సమీక్షించారు. నూతన నేర చట్టాలు (ఎన్సీఎల్) అమలు దిశగా బీపీఆర్డీ చేస్తున్న ప్రయత్నాలు, అమలు చేస్తున్న కార్యక్రమాలను కూడా సమీక్షించారు.

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారత పోలీసు బలగాలను స్మార్ట్ బలగాలుగా మార్చేందుకు బీపీఆర్డీ కట్టుబడి ఉందని హోం మంత్రి తెలియజేశారు. దీనికి అవసరమైన మేధోపరమైన, భౌతికమైన సంస్థాగత వనరులను సమకూర్చుకోవడం ద్వారా శాంతిభద్రతలతో పాటుగా అంతర్గత భద్రత విషయంలో ఎదురవుతున్న సవాళ్లను ధీటుగా ఎదుర్కోవాలని అన్నారు.

కార్యనిర్వాహక విభాగం, బీపీఆర్డీ, ఎన్సీఆర్బీ, జైళ్ల అధికారులు, ఫోరెన్సిక్ నిపుణులు నేరాలు జరిగిన విధానాన్ని విశ్లేషించాలని సమావేశంలో చర్చ సందర్భంగా హోం మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలో శాంతిభద్రతల పరిరక్షణలో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించేందుకు బీపీఆర్డీ సర్వే చేపట్టి పరిష్కారాలు కనుగొనేందుకు కృషి చేయాలని అన్నారు.

పరిశోధనా అధ్యయనాలు, ప్రాజెక్టుల్లో వివిధ రంగాల నిపుణుల సహకారంతో పాటుగా అంతర్జాతీయంగా పేరొందిన సంస్థల భాగస్వామ్య ప్రాధాన్యం గురించి శ్రీ అమిత్ షా మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన పరిధి నేపథ్యంలో బీపీఆర్డీ ప్రాజెక్టులు, అధ్యయనాలు, ప్రచురణల ద్వారా పోలీసు బలగాలు ప్రయోజనం పొందడంతో పాటు ప్రజల మనస్సుల్లో వారి విలువ పెరిగేలా సూచనలు అందించారు. ఎన్సీఎల్ శిక్షణ–అమలు, పాత పోలీసు, జైలు విధానాలు, పద్ధతులను మెరుగుపరచి పోలీసు బలగాలను ఆధునికీకరించడంతో పాటు కొత్త తరం సవాళ్లను ఎదుర్కొనేందుకు బ్యూరో చేస్తున్న కృషిని హోం మంత్రి ప్రశంసించారు. మంత్రిత్వ శాఖను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు అనుసంధానించేందుకు నోడల్ ఏజెన్సీగా బీపీఆర్డీ పోషిస్తున్న పాత్ర గురించి ప్రముఖంగా ప్రస్తావించారు. నేర న్యాయ వ్యవస్థకు సంబంధించిన అని ప్రధాన విభాగాలకు వాటి ప్రత్యేక అవసరాలకు అనుగుణంగా సహాయం చేసే విధంగా బ్యూరో పనితీరును క్రమబద్ధీకరించాలని శ్రీ షా ఆదేశించారు. పోలీసింగ్ అవసరాలను తీర్చేందుకు గానూ మేక్ ఇన్ ఇండియా పద్ధతి పాటించాల్సిన ఆవశ్యకతను హోం మంత్రి ప్రముఖంగా ప్రస్తావించారు. అలాగే సమస్యలను గుర్తించి ప్రభావవంతమైన పరిష్కారాలను కనుగొనేందుకు నేర న్యాయ నిపుణులు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, మంత్రిత్వ శాఖ భాగస్వామ్య అవసరం గురించి సైతం చర్చించారు. బ్యూరో నిర్వహణ సజావుగా సాగేందుకు అవసరమైన సహాయ, సహకారాలు అందిస్తామని హోం మంత్రి హామీ ఇచ్చారు.

# మానసిక ఆరోగ్యంపై భారత నావికా దళం వర్క్‌షాప్

న్యూఢిల్లీ, జనవరి 10:ప్రపంచ ప్రసిద్ధి పొందిన ఆధ్యాత్మిక గురువు సోదరి బీకే శివాని ఆధ్వర్యంలో భారత నావికా దళానికి 'స్వీయ–పరివర్తన, అంతర్గత చైతన్యం' అనే అంశంపై కార్యశాల (వర్క్‌షాప్) ను నిర్వహించారు. ఈ నెల ఏడో తేదీన డీఆర్‌డీవో భవన్లోని డా. డీఎస్ కొఠారి ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్మీ అధికారుల్లో మానసిక, భావోద్వేగ స్థైర్యాన్ని పెంపొందించే ఉద్దేశంతో ఈ కార్యశాలలను ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా చీఫ్ ఆఫ్ మెటీరియల్ వైస్ అడ్మిరల్ కిరణ్ దేశ్‌ముఖ్ హాజరయ్యారు.

స్వాగతోపన్యాసంతో ప్రారంభమైన ఈ వర్క్‌షాప్‌లో సోదరి బీకే శివాని రెండు గంటల పాటు శిక్షణ ఇచ్చారు. మానసిక ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరాన్ని, భావోద్వేగ సమతౌల్యం గురించి వివరించారు. ముఖ్యంగా నౌకాదళంలో అధిక ఒత్తిడితో నిండిన బాధ్యతలు నిర్వర్తిస్తున్నవారు అనుసరించాల్సిన ఆచరణాత్మక విధానాలను వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగింది.

మెదడు పనితీరు, మానసిక ప్రశాంతత ప్రాముఖ్యత గురించి కార్యక్రమానికి హాజరైన నావికా సిబ్బందిని ఆకట్టుకొనేలా సోదరి బీకే శివాని వివరించారు. మానసిక ఒత్తిడికి మూల కారణాలను అర్థం చేసుకోవడంతో పాటు స్వీయ అవగాహన, ధ్యానం, సానుకూల ఆలోచనాధోరణి ద్వారా దాన్ని అధిగమించేందుకు అవసరమైన మార్గాలను చర్చించారు. మన ఆలోచనల ద్వారానే మానసిక ఆరోగ్యం మొదలవుతుందని ఆమె స్పష్టం చేశారు. ప్రశాంతమైన, సానుకూల, సాధికారత కల్పించే ఆలోచనలను ఎంచుకోవడం ద్వారా మన అనుభవాలు మారతాయి, సంతోషకరమైన, ఆరోగ్యవంతమైన జీవితాన్ని రూపొందించుకోవచ్చు.

చీఫ్ ఆఫ్ మెటీరియల్ ముగింపు ఉపన్యాసమిస్తూ వృత్తి, వ్యక్తిగత జీవితాలు సంతృప్తికరంగా ఉండాలంటే మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలని చెబుతూ ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు. శాంతియుతమైన, సమష్టి పని వాతావరణానికి నౌకాదళ అధికారులకు మానసిక ప్రశాంతతే ప్రాథమికమని ఆయన అన్నారు. మానసిక ఆరోగ్య సంరక్షణకు అంకితమైన సోదరి బీకే శివానిని చీఫ్ ఆఫ్ మెటీరియల్ ప్రశంసించారు. ఇక్కడ నేర్చుకున్న వాటిని వారి దైనందిన జీవితాల్లో అమలుచేయాలని కార్యశాలకు హాజరైనవారికి సూచించారు.

నావికా దళ అధికారులు, వారి కుటుంబ సభ్యుల మానసిక ఆరోగ్యానికి, వారి మధ్య సుహృద్భావానికి ప్రాధాన్యమిస్తూ 60 రోజుల కార్యక్రమంలో భాగంగా భారత నౌకాదళం ఈ వర్క్ షాపును చేపట్టింది. జీవితంలో మానసిక ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఇది తెలియజేసింది. అలాగే సానుకూల ఆలోచనలతో ముందుకు సాగేలా ప్రేరణ ఇచ్చింది. ఈ కార్యశాలకు నౌకాదళ అధికారులు, నావికులు, రక్షణ రంగంలో ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులు హాజరయ్యారు.

సిబ్బంది శ్రేయస్సుపై పూర్తి స్థాయిలో దృష్టి పెట్టాలన్న నౌకా దళం దృఢ సంకల్పానికి... విజయవంతంగా నిర్వహించిన ఈ వర్క్ షాపే ప్రబల నిదర్శనం

సామాన్యులకు సైతం ఈ కార్యక్రమం ద్వారా మేలు చేకూర్చే ఉద్దేశంతో భారతీయ నౌకాదళం అధికారిక యూట్యూబ్ ఛానల్ ద్వారా ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు.

# కేటీఆర్ ఏమైనా ఫ్రీడం ఫైటరా.. బండి సంజయ్

**–ఆ రెండు పార్టీలు.. పొలిటికల్ డ్రామాలు**
**–కేబినెట్ ఆమోదం లేకుండా కోట్లు మళ్లించిన కేటీఆర్**
**–చర్యలు తీసుకునే ధైర్యం లేని సీఎం**
**–అడ్డగోలుగా తిడుతున్నా.. చలనం లేని రేవంత్**
**–కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్**



కరీంనగర్, జనవరి 10: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేబినెట్ ఆమోదం లేకుండానే కోట్ల నిధులు దారి మళ్లించిన మాజీ మంత్రి కేటీఆర్ ఏమైనా స్వాతంత్ర్య సమరయోధుడా? ఈ ఫార్ములా రేస్ స్కాంలో కేటీఆర్ వ్యవహరిస్తున్న తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఫైర్ అయ్యారు. శుక్రవారం కరీంనగర్‌లో మీడియాతో మాట్లాడారు. కేబినెట్ అనుమతి లేకుండా సర్కార్ సొమ్మును అప్పనంగా ఎలా విడుదల చేస్తారని ప్రశ్నించారు. ఆర్థిక శాఖ అనుమతి లేకుండా నిధులు ఎలా విడుదల చేశారని, తప్పు చేసి కప్పిపుచ్చుకోవడానికి రూ.700 కోట్ల లాభం వచ్చినట్లు డ్రామాలాడుతున్నారన్నారు. రూ.700 కోట్ల లాభం ఎట్లా వచ్చిందో లెక్క చెప్పాలని, లాభం వచ్చిన సొమ్ము యాడ ఉందో ప్రజల ముందుంచాలని అన్నారు.

**అడ్డగోలుగా తిడుతున్నా.. చలనం లేని రేవంత్**

ఒక సీఎంను లొట్టపీసు సీఎం, చిట్టినాయుడు, సన్నాసి అంటూ తిడుతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అంతు చిక్కడం లేదని సంజయ్ అన్నారు. కేటీఆర్ తిడుతున్నా సీఎంలో చలనం లేదని, అరెస్ట్ చేయకుండా విచారణ పేరుతో జాప్యం చేయడాన్ని చూస్తుంటే అనేక అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కేసీఆర్‌తో రేవంత్ రెడ్డి లోపాయికారీ ఒప్పందం చేసుకున్నట్లు అనుమానం వస్తుందన్నారు.

**ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలకు కప్పం కడుతున్న కేసీఆర్**

బీఆర్ఎస్ సర్కార్ చేసిన స్కామ్‌లు తెరపైకి వచ్చినప్పుడల్లా కేసీఆర్ ఢిల్లీకి వెళ్లి కాంగ్రెస్ పెద్దలకు కప్పం కట్టి వస్తున్నారని బండి ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని, ఈ రెండు పార్టీల రాజకీయ డ్రామాలను ఎండగడతామన్నారు. ముఖ్యంగా బీఆర్ఎస్ నేతల అవినీతిని, కేసీఆర్ అవినీతిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో బీజేపీ రాజీలేని పోరాటం చేస్తోందన్నారు.

# బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం

**–సాంకేతిక పరిజ్ఞానంతో చిక్కిన ముగ్గురు**
**–ఛాలెంజ్‌గా తీసుకొని కేసు ఛేదించిన పోలీసులు**
**–అభినందించిన ఎస్పీ అఖిల్ మహాజన్**



కరీంనగర్, జనవరి 10:రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగిన బాలిక కిడ్నాప్ కేసు సుఖాంతమైంది. బాలిక కిడ్నాప్ కేసు ఎలాంటి ఆధారాలు లేకపోయినా సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. శుక్రవారం సిరిసిల్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలను తెలిపారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చింతపల్లి గ్రామానికి చెందిన సింగారపు మధు, లాస్య దంపతులకు ఇద్దరు కుమార్తెలున్నారు. లాస్యకు మతిస్థిమితం లేకపోవడంతో మధు కుటుంబానికి దూరంగా ఉంటూ వస్తున్నాడు.

లాస్య తన కూతురు అద్విత(4)తో కలిసి వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి వచ్చింది. దర్శనం కోసం వచ్చిన మహబూబాబాద్‌కు చెందిన ముగ్గురు మహిళలతో చనువు ఏర్పడింది. ఐదు రోజులుగా ఆలయ ఆవరణలో నిద్ర చేస్తూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ క్రమంలో పాప తల్లి మతిస్థిమితం లేకపోవడం కారణంగా పాపను సరి గ్గా చూసుకోవడం లేదని గమనించిన ముగ్గురు మహిళలు లాస్యను నమ్మించి గత డిసెంబర్ 23వ తేదీన వారితో పాటు తీసుకువెళ్లారు. పాప అదృశ్యం కావడంతో తన మేనమామ పాలమూరు గంగస్వామి వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మతిస్థిమితం లేని కారణంగా ఎలాంటి విషయాలు చెప్పకపోవడంతో ఆధారాలు లేనప్పటికీ జిల్లా పోలీసు యంత్రాంగం ఛాలెంజ్‌గా తీసుకొని రాజరాజేశ్వర దేవస్థానం బస్టాండ్, రైల్వే స్టేషన్, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, విజయవాడ ప్రాంతాల్లో సీసీ కెమెరా పరిశీలించి ఆధునిక సాంకేతిక పరి జ్ఞానాన్ని ఉపయోగించి మహబూబాబాద్ జిల్లా లోని ఒక గ్రామంలో నిందితులు ఉన్నట్లు గుర్తించారు. గ్రామ సర్పంచ్ సహాయంతో నిందితులైన శ్రీరామోజీ వెంకట నరసమ్మ, గంభీరపు అంజవ్వ, కూనపురి అప్పమ్మల దగ్గర నుంచి పాపను కాపాడి బాలరక్ష భవన్‌కు అప్పగించారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, సిఐలు వీరప్రసాద్, సదన్ కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# రిటైర్మెంట్ వయస్సు పెంచాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

**–చిక్కాల సతీష్ టి పి టి ఎఫ్ మండల అధ్యక్షులు**



మహబూబ్‌నగర్,జనవరి 10: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచాలనే నిర్ణయం ఎంతో మంది నిరుద్యోగులకు నష్టదాయకమని,వారు సంవత్సరాల తరబడి ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూస్తున్న సందర్భంలో గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం అనైతిక చర్య అని ఇట్టి నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోని నిరుద్యోగులకు న్యాయం చేయాలని పెద్దవంగర మండల టి పి టి ఎఫ్ అధ్యక్షులు చిక్కాల సతీష్ అన్నారు. ప్రస్తుత జీవన ప్రమాణ రేటు పరిశీలన చేస్తే ప్రస్తుతమున్న ఈ 61 సంవత్సరాల వయసు సరిపోతుందని వారు అన్నారు. కేవలం పదవీ విరమణ ఉద్యోగులకు చెల్లించవలసిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్, లీవ్ ఎన్కాష్మెంట్ ,జెడ్పి జిపిఎఫ్ ఫైనల్ పేమెంట్స్ చెల్లించలేకనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటుదని,మార్చి 2024 నుండి రిటైర్ అయినటువంటి ఏ ఉద్యోగికి, ఉపాధ్యాయునికి ఇట్టి చెల్లింపులు చెల్లించకపోవడం దురదృష్టకరం అని,అది వారి [illegible] దెబ్బతీస్తుందని,ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ అశాస్త్రీయమైన పదవీ విరమణ పెంపు నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకొని,నిరుద్యోగులను ఆదుకోవాలని కోరారు.


తెలంగాణ రాష్ట్ర భాషా మరియు సాంస్కృతిక శాఖ
యం.వి.ఆర్.ఫౌండేషన్
సంయుక్త ఆధ్వర్యంలో



ఆహ్వానం
గ్రంథావిష్కరణ సభ
సప్తశతి
(వివిధకవుల సప్తపదుల కవితాసంకలనం)
సృజనకర్త :సుధామ
వైజయంతి
(విహారి - 'జగన్నాథ పండితరాయలు'నవలా సమాలోకనం)



2025 జనవరి '11 శనివారం ఉదయం 10 గంటలకు
ముఖ్యఅతిథి,ఆవిష్కర్త : డా.కె.వి.రమణాచారి గారు (విశ్రాంత ఐ.ఏ.ఎస్.అధికారి) (పూర్వ సలహాదారు,తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం)
అధ్యక్షులు: డా.వై. రామకృష్ణారావు (ప్రముఖ కవి,సాహితీ వేత్త)
విశిష్ట అతిథి: శ్రీ జి. వల్లీశ్వర్ (పూర్వ సంపాదకులు,ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక)
ఆత్మీయ అతిథులు : శ్రీ సింహప్రసాద్ (సుప్రసిద్ధ కథా,నవలా,నాటక రచయిత )
శ్రీ సి.ఎస్.రాంబాబు (సాహితీవేత్త ,ఆకాశవాణి పూర్వ సహాయ సంచాలకులు)
సమావేశ మందిరం (మొదటి అంతస్తు) రవీంద్ర భారతి హైదరాబాదు
నిర్వహణ
మట్టిగుంట వెంకటరమణ యం.వి.ఆర్.ఫౌండేషన్,హైదరాబాదు

# ఏం మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నారు.. వికారాబాద్ కలెక్టర్ తీరుపై హరీశ్‌రావు ఆగ్రహం..



హైదరాబాద్, జనవరి 10: సీఎం రేవంత్ రెడ్డి అన్న అనుముల తిరుపతి రెడ్డికి స్కూల్ పిల్లల పరేడ్‌తో స్వాగతం పలికించిన వికారాబాద్ కలెక్టర్ తీరును మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. ఎన్నో ఉన్నత చదువులు చదువుకొని, ఎన్నో త్యాగాలు చేసి వచ్చే అఖిల భారత సర్వీస్ అధికారులు ప్రజాసేవలో తమ పరిణతిని, బుద్ధి కుశలతను ప్రదర్శించాలని సూచించారు. అప్పుడే ప్రజల్లో అధికారుల పట్ల గౌరవ భావం ఏర్పడుతుందని తెలిపారు. భారత జాతీయ చిహ్నం మూడు సింహాలు తలెత్తుకొని ప్రజల పట్ల మనకుండే బాధ్యతను గుర్తు చేస్తాయని అన్నారు. ప్రభుత్వాలు వస్తాయి పోతాయి.. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదని అధికారులు తెలుసుకోవాలని సూచించారు.

వికారాబాద్ కలెక్టర్‌గా పని చేస్తున్న ప్రతీక్ జైన్ గతంలో రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్‌గా ఎంతో మంచి పేరున్న నిక్కచ్చి అధికారిగా పని చేశారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కానీ తలవంచి దండాలు పెట్టడం.. అర్హత లేని, కనీసం ప్రజలతో వార్డ్ నెంబర్‌గా కూడా ఎన్నుకోబడని వ్యక్తులను రెడ్ కార్పెట్ వేసి తనతో తీసుకెళ్తూ చదువుకునే చిన్నారులతో సెల్యూట్లు చేయించటం ఇది దేనికి చిహ్నమని ప్రశ్నించారు. ఐఏఎస్ అధికారుల పనితీరును పర్యవేక్షించే ఆనీఖు ఇది గమనించటం లేదా అని నిలదీశారు.

కాంగ్రెస్ పార్టీని ఆదర్శంగా తీసుకొని తెలంగాణ ముఖ్యమంత్రి కుటుంబ పాలన చేయటం ప్రజలు చూస్తూనే ఉన్నారని హరీశ్‌రావు అన్నారు. ఒక ఐఏఎస్ అధికారిగా ఆ చిన్నారులకు మీరేం సందేశం ఇవ్వదలచుకున్నారని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ను ప్రశ్నించారు. ముఖ్యమంత్రి అన్నకు, సీఎం కుటుంబసభ్యులకు ఇలా రాచ మర్యాదలతో స్వాగతం పలకాలని ఏ చట్టం చెబుతుందని ప్రశ్నించారు. కుటుంబపాలన చేస్తూ అక్రమ కేసులతో పైశాచికానందాన్ని పొందుతున్న అబద్ధాల సీఎం రోజులు దగ్గర పడ్డాయని వ్యాఖ్యానించారు.

# నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా నిలుస్తా

## అల్ఫోర్స్ చైర్మన్ వి నరేందర్ రెడ్డి

కరీంనగర్, జనవరి 10: (నేటినిజం ప్రతినిధి) బూరుగుపల్లి మీదుగా గోపాల్ రావు పేటకు చేరకుంది. ఈ సందర్భంగా



ఉత్తర తెలంగాణను ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కరీంనగర్, అదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రులు, ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ వి. నరేందర్ రెడ్డి వెల్లడించారు. శుక్రవారం రామడుగు మండలం గోపాల్ రావు పేట్‌లో పట్టబదులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనంకు విచ్చేసిన నరేందర్ రెడ్డికి 500 మంది స్థానిక యువత భారీ బైక్ ర్యాలీతో ఘన స్వాగతం పలికారు. బైక్ ర్యాలీ షానగర్ నుండి పెగడపల్లి, ఆయన మాట్లాడుతూ పల్లెల్లో ఉపాధి లేక ఇతర దేశాలకు వలసలు వెళున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెరుగు మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని అన్నారు. విద్యారంగ సమస్యలపై అవగాహన ఉన్న తాను రాజకీయాల్లోకి వచ్చి యువతకు రోల్ మాడల్ గా ఉంటానని వెల్లడించారు. నిరుద్యోగ పట్టభద్రులకు బాసటగా నిలిచేందుకే తాను ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నట్లు వెల్లడించారు.. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రంథాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి వాటిని బలోపేతం చేస్తానని అన్నారు.. లైబ్రరీలన్నింటిని సెంట్రల్ లైబ్రరీ మార్చుతూ. 24/7 వైఫై సౌకర్యం నిరుద్యోగ యువతకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతానని వెల్లడించారు. నిరుద్యోగ యువతను మోసం చేసేందుకు పారాచుట్ లీడర్లు వస్తున్నారని వారి పట్ల అప్రవృత్తంగా ఉండాలని అన్నారు. ఉత్తర తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి స్టేడియం ను నిర్మిస్తానని పేర్కొన్నారు. ప్రైవేటు జూనియర్ డిగ్రీ ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని అన్నారు. పార్ట్ టైం, గెస్ట్, కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించి వారికి అండగా ఉంటానని పేర్కొన్నారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని, గోపాల్ రావు పేట పరిధిలోని తన మిత్రులు శ్రేయోభిలాషులు తాము ఓటు వేయడంతో పాటు ఒక్కొక్కరు మరో 10 ఓట్లు వేయించి తన గెలుపులో కీలక పాత్ర పోషించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలి



హైదరాబాద్, జనవరి 10:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీసీలను మరోమారు మోసం చేయకుండా 42 శాతం రిజర్వేషన్లపై చట్టం చేసి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని లేదంటే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జల్లపల్లి అంజి అధ్యక్షతన 20 బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి ప్రక్రియ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లను 20 నుంచి 42 శాతం పెంచుతూ అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్‌చేయాలని కోరారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం డెడికేటెడ్ కమిషన్ సిఫార్సు చేసి అసెంబ్లీ చట్టం చేస్తే చట్టపరమైన న్యాయపరమైన అవరోధాలు ఉండవన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రకారం సర్పంచ్, ఎంపీటీసీ,జడ్పీటీసీ, వార్డు మెంబర్లలో 42 శాతం రిజర్వేషన్లు పెంచకపోతే యుద్ధం జరుగుతుందని హెచ్చరించారు. ఫిబ్రవరి నెలాఖరుకు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తామని సీఎం ప్రకటించారని, ఇచ్చిన హామీ ప్రకారం చట్టాన్ని తీసుకువచ్చి ఎన్నికలను నిర్వహించాలని, లేదంటే బీసీల ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. అసవరమైతే రాష్ట్రంలోని అన్ని పార్టీలు, ప్రజాసంఘాలు, కులసంఘాలు, మేధావులతో కలిసి గుజ్జర్ల తరహాలో ఐక్యపోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నిమ్మల వీరన్న, వోదీ రామ్‌దేవ్,మల్లేష్, పి.సతీష్

# జ్ఞానసముపార్జనకు ఏకాగ్రత శక్తి అత్యంత కీలకమైనది

## -స్వామి వివేకానంద జయంతి వారోత్సవాల్లో బడుగు శ్రీరాములు




చౌటుప్పల్ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల చౌటుప్పల లో శ్రీ పాలకూర శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు ప్రజ్ఞా పాట ఒక పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్నే శివకుమార్ అధ్యక్షత వహించారు. పాలకూర్ల శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్ పర్సన్ పాలకూర మురళి గౌడ్ స్వాగతం ఉపన్యాసం చేశారు. ప్రముఖ సాహితీవేత్త సహస్ర ప్రహేలిక ప్రాజ్ఞులు బడుగు శ్రీరాములు క్విజ్ మాస్టర్ గా వ్యవహరించారు. ఈ సందర్భంగా బడుగు శ్రీరాములు మాట్లాడుతూ జ్ఞానసముపార్జనకు ఏకాగ్రత శక్తి అత్యంత కీలకమైనదన్నారు. ఆపదలను అవకాశాలు గా మలుచుకుని చరిత్ర పుటలలో చిరస్థాయిగా నిలిచిపోయిన ప్రాచీన భారతదేశపు వీరుల, విదుషీమణుల వీర గాథలు రేపటితరానికి స్ఫూర్తి నీ నింపుతాయి కావున పుస్తక పఠనం చేయాలన్నారు. పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. విజేతలకు నగదు పారితోషికం తో పాటు వివేకానంద సాహిత్య పుస్తకాలు విద్యార్థులందరికీ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేశారు

# తిరుమలలో అత్యంత వైభవంగా స్వర్ణ రథం ఊరేగింపు

తిరుపతి, జనవరి 10:వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో శుక్రవారం స్వర్ణ రథం (ఉనీశ్రీటవని అప్త్రజీతీతినీబి) ఊరేగింపు అత్యంత వైభవంగా జరిగింది. శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి స్వర్ణ రథంపై కొలువై తీరి మాడ వీధుల్లో విహరించారు. ముఖ్యంగా మహిళా ఉద్యోగులు, భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంతో గోవిందా..గోవిందా అంటూ స్వర్ణ రథాన్ని లాగారు. పాలకమండలి సభ్యురాలు సుచిత్రా ఎల్లా, అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తర ద్వార దర్శనం కోసం రాజకీయ, సినీ, క్రీడా ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే శ్రీ వేంకటేశ్వరస్వామిని ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. రాష్ట్రాల గవర్నర్లు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు స్వామివారిని దర్శించుకున్నారు.

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ కేంద్ర విమానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు కుటుంబ సభ్యులు, ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, తెలంగాణ ఎమ్మెల్యే మల్లారెడ్డి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

శివసేన ఎంపీ శ్రీకాంత్ షిండే, మాజీ సీఎం ఎన్టీఆర్ తనయుడు రామకృష్ణ, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సతీమణి వసుంధర, బాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపిచంద్ ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్ తదితరులు ఏడుకొండలవాడిని దర్శించుకున్నారు.

# కేసీఆర్‌ను కలిసిన గులాబీ నేతలు !

హైదరాబాద్, జనవరి 10:వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఎర్రవల్లి నివాసంలో మాజీ ముఖ్యమంత్రి, భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు కేసీఆర్ ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా గులాబీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. శుక్రవారం ఎరవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో గులాబీ బాస్ ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, హుజరాబాద్ శాసనసభ్యులు పాడి కౌశిక్ రెడ్డి, పట్లోల్ల కార్తిక్ రెడ్డి లు కలిశారు.

# బొలెరోను ఢీకొన్న బైక్.. ఒకరు మృతి

కరీంనగర్, జనవరి 10: పెద్దపల్లి జిల్లా రంగాపూర్‌లో (శుక్రవారం) జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. పెద్దపల్లి ట్రాన్స్‌కోకు చెందిన బోలోరోను బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో కాల్వ శ్రీరాంపూర్ మండలం మంగపేట్ గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందగా, పెద్దపల్లి మండలం అప్పన్నపేట్ గ్రామానికి చెందిన మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.

క్షతగాత్రుడిని పెదపడల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న బసంత్ నగర్ ఎస్సై స్వామి ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# భక్తులకు సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే : శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్,జనవరి 10: తిరుమల ఘటన బాధాకరమని, మళ్లీ ఇలాంటి ఘటనలు జరుగకుండా చూడాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పిల్లలమర్రి రోడ్డులో గల వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాలకు భక్తులు ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో తగిన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందన్నారు.

కాటన్ మిల్లు వెంకటేశ్వర స్వామి టెంపుల్ అభివృద్ధికి సహకారం ఇవ్వాలని గతంలో నేను కోరితే టీటీడీ స్పందించి ఆలయ అభివృద్ధికి సహకారం ఇచ్చిందని గుర్తు చేశారు. తిరుమల తరహా ఈ గుడిలో కూడా స్వామి వారికి పూజలు చేస్తారన్నారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. భగవంతుడు అందరిని చల్లగా చూడాలని స్వామివారిని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# ట్రంప్‌కు సుప్రీం కోర్టులో చుక్కెదురు

న్యూ డిల్లీ జనవరి 10 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ న్యూయార్క్‌లోని హష్ మనీ కేసులో తనకు శిక్ష విధించడంలో జాప్యానికి చేసిన ప్రయత్నాన్ని ఏకాభిప్రాయం లేని సుప్రీం కోర్టు గురువారం తిరస్కరించింది. 54తో కోర్టు వెలువరించిన ఉత్తర్వు వల్ల ట్రంప్‌కు జడ్జి జువాన్ ఎం మెర్చన్ శిక్ష విధించేందుకు మార్గం సుగమం అయింది. పోర్న్ నటి స్టార్మీ డేనియల్స్‌కు లక్షా 30 వేల డాలర్ల హష్ మనీ చెల్లింపును గోప్యంగా ఉంచేందుకు చేసిన యత్నంగా ప్రాసిక్యూటర్లు పేర్కొన్న కేసులో దోషిగా ట్రంప్‌ను నిర్ధారించడమైంది

. డేనియల్స్‌తో తనకు సంబంధంలేదని, తాను ఏ తప్పూ చేయలేదని ట్రంప్ వాదించారు.ట్రంప్ అత్యవసర పిటిషన్‌ను తిరస్కరించడంలో కోర్టులోని ముగ్గురు సరళస్వభావ న్యాయమూర్తులతో ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్, న్యాయమూర్తి అమీ కోనీ బారెట్ కలిశారు. ట్రంప్‌కు జైలు శిక్ష, జరిమానా లేదా ప్రోబేషన్ విధించబోనని మెర్చన్ సూచించినందును ఆయనకు విధించే శిక్ష కఠినంగా ఉండబోదని వారు పేర్కొన్నారు. ఈ లోగా తీర్పునకు వ్యతిరేకంగా ట్రంప్ వాదనలను మామూలు అప్పీళ్ల ప్రక్రియలో భాగంగా విచారించవచ్చునని మెజారిటీ న్యాయమూర్తులు భావించారు.

# శ్రీ చైతన్య పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలు




రాజన్న సిరిసిల్ల, జనవరి 10:(నేటినిజం ప్రతినిధి): నేటి నిజం ప్రతినిధి వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య హైస్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలు అంబరాన్ని తాకాయి. ఈ సందర్భంగా ఏజీఎం ముద్రకోల రాజు పాఠశాల ప్రిన్సిపల్ సుదీష్ కుమారి మాట్లాడుతూ భారతీయ సనాతన సాంప్రదాయాల్లో సంక్రాంతి పండుగ పర్వదిన వేడుకలు ముఖ్యమైనవని అన్నారు. సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే సమయంలో సంక్రాంతి పండగ పర్వదిన వేడుకలు జరుపుకుంటామని ఈరోజు ఇళ్ల ముందు కల్లాపి జల్లి గొబ్బెమ్మలతో వాకిళ్ళు అలంకరించి హరిదాసుల, గంగిరెద్దుల విన్యాసాలతో పండుగ వాతావరణం సంతరించుకొంటుందని అన్నారు. అనంతరం విద్యార్థులు భోగి మంటలు వేసి రక రకాల ముగ్గులు వేసి పాఠశాలలో సంక్రాంతి శోభను నింపారు. విద్యార్థులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ ప్రవీణ్, డీన్ అంజయ్య, సి బ్యాచ్ ఇంచార్జ్ అరుణ్, పి ఈ టి సుధాకర్, మారుతి, విద్యార్థిని, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తప్పు జరిగింది.. న్యాయ విచారణలో అన్ని నిజాలు తెలుస్తాయి - టీటీడీ చైర్మన్



తిరుపతి, జనవరి 10: తొక్కిసలాట జరిగిన నేపథ్యంలో టీటీడీ పాలకమండలి నేడు అత్యవసర సమావేశం నిర్వహించింది. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన సమావేశమైన పాలకమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.

సీఎం చంద్రబాబు ఆదేశించిన అనుసారం అత్యవసర పాలకమండలి సమావేశం నిర్వహించినట్లు టీటీడీ ఛైర్మన్ తెలిపారు. సీఎం ఇచ్చిన ఆదేశాలను పాలకమండలిలో చర్చించి ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. మృతులపట్ల పాలకమండలి తీవ్ర సంతాపం తెలిపిందన్నారు.'

మృతుల కుటుంబాలకు ఒక్కొకరికి 25 లక్షలు, తీవ్రంగా గాయపడ్డ వారికి 5 లక్షలు.. గాయపడ్డ వారికి 2 లక్షలు.. మృతుల కుటుంబ సభ్యుల చదువును టీటీడీ భరిస్తుంది. టీటీడీ స్వయంగా వెళ్లి నష్టపరిహారాన్ని అందిస్తుంది. జ్యూడిషల్ విచారణ అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.. చనిపోయిన కుటుంబ సభ్యుల్లో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం కల్పిస్తూ' నిర్ణయాలు తీసుకున్నట్లు టీటీడీ ఛైర్మన్ ప్రకటించారు.'.

ఉద్దేశ పూర్వకంగా జరిగిన సంఘటన కాదు.. ఏర్పాట్లు సరిగ్గా లేని ఒకటి రెండు చోట్ల ఘటన చోటు చేసుకుంది. ఈ ఏడాది 10 రోజులపాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పిస్తాం. రెండు రోజుల నిర్వహణపై ఆగాక సలహా మండలి సలహా మేరకు నిర్ణయం తీసుకుంటాం. దర్శనకు వెళ్లాలంటేనే టోకెన్స్ కావాలి అని మాత్రమే చెప్పాం.. తిరుమలకు భక్తులను అనుమతిస్తాం అని వెల్లడించాం.

తప్పు జరిగింది.. క్షమాపణ చెప్తే చనిపోయిన భక్తులు తిరిగిరారు కదా? జ్యూడీషియల్ ఎంక్వయిరీలో అన్ని వివరాలు భయటకి వస్తాయి.. జ్యూడీషియల్ ఎంక్వయిరీలో అన్ని వివరాలు భయటకి వస్తాయి' అని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు.

# జనగామలో పోలీసుల ముమ్మర తనిఖీలు



జనగామ,జనవరి 10: జనగామ ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ ఆధ్వర్యంలో సంక్రాంతి, రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ లతో అర్బన్ పోలీసులు ముమ్మర తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్, బతుకమ్మ కుంటతో పాటు జన సంచారం అధికంగా ఉండే ప్రధాన కూడళ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేశారు.

ఈ సందర్భంగా ఏఎస్పీ పండేరి చేతన్ నితిన్ మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఎవరైనా అనుమానితుల కదలికలు కనిపిస్తే వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ తనిఖీల్లో అర్బన్ సీఐ పీ దామోదర్ రెడ్డి, ఎస్సైలు రాజేశ్ కుమార్, భరత్, రాజన్ బాబు, ఏఎస్సై సాంబారెడ్డి, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైలు ప్రయాణికుడ్ని బెల్టుతో కొట్టిన కోచ్ అటెండెంట్స్, టీటీఈ..



న్యూఢిల్లీ, జనవరి 10:కోచ్ అటెండెంట్స్, టీటీఈ కలిసి రైలు ప్రయాణికుడ్ని దారుణంగా కొట్టారు. కోచ్ అటెండెంట్ అతడ్ని బెల్ట్‌తో బాదాడు. ఆ తర్వాత వారంతా కలిసి కిందపడిన ప్రయాణికుడి మీదకు ఎక్కి కాళ్లతో తొక్కి తన్నారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో ఆ ముగ్గురు రైల్వే ఉద్యోగులను సస్పెండ్ చేశారు. అమృత్‌సర్–కతిహార్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ఈ సంఘటన జరిగింది. కదులుతున్న రైలులో ప్రయాణికుడు షేక్ తాజుద్దీన్‌తో కలిసి టీటీఈ రాజేష్ కుమార్, కోచ్ అటెండెంట్ విక్రమ్ చౌహాన్ మద్యం సేవించారు.

కాగా, మద్యం మత్తులో టీటీఈపై దాడికి ప్రయాణికుడు షేక్ తాజుద్దీన్ ప్రయత్నించాడు. దీంతో కోచ్ అటెండెంట్ విక్రమ్ చౌహాన్ రెచ్చిపోయాడు. బెల్ట్‌తో అతడ్ని చితకబాదాడు. మరో కోచ్ అటెండెంట్ సోను మహాతో కూడా అక్కడకు చేరుకున్నాడు. వారంతా కలిసి తాజుద్దీన్ మీదకు ఎక్కి కాళ్లతో తన్నారు.

మరోవైపు రిజర్వేషన్ కంపార్ట్‌మెంట్‌లో జరిగిన ఈ సంఘటనను కొందరు ప్రయాణికులు మొబైల్ ఫోన్లలో రికార్డ్ చేశారు. రైల్వేకు ట్యాగ్ చేయడంతోపాటు సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో ఈ వీడియో క్లిప్ వైరల్ అయ్యింది. ఈ నేపథ్యంలో రైల్వే పోలీసులు స్పందించారు. మద్యం సేవించిన ప్రయాణికుడు షేక్ తాజుద్దీన్‌ను స్టేషన్‌లో రైలు నుంచి దించివేశారు.

కాగా, డ్యూటీలో మద్యం సేవించిన టీటీఈని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే కోచ్ అటెండర్లు పరారయ్యారు. ఈ ముగ్గురు రైల్వే సిబ్బందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రైల్వే కూడా ఈ సంఘటనపై స్పందించింది. ఆ ముగ్గురు రైల్వే ఉద్యోగులను సస్పెండ్ చేసింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.